PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 5 | విజయవాడ, శనివారం 5 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 5 August 2023 | Rs

'పోలవరం' బ్యాక్ వాటర్ వల్లే మునక

- సాధారణ వరదగా భావించవద్దు
- 4 మండలాల్లో గ్రామాల ముంపుపై ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

3

మూడింట రెండొంతుల ప్రయాణం పూర్తి..

నేడు చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-3

బెంగళూరు: చంద్రుడిపై పరిశోధనల కోసం ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ లక్ష్యానికి మరింత చేరువైంది. ఇప్పటికే భూమి చుట్టూ కక్ష్యలను పూర్తిచేసుకుని దూసుకెళ్తోన్న ఈ వ్యోమనౌక ఆగస్టు 5న చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించనుంది. 'చంద్రయాన్-3'ని చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తలు ఈ నెల 5న రాత్రి 7 గంటల సమయంలో చేపట్టనున్నారు. చంద్రయాన్ తన ప్రయాణంలో ఇప్పటివరకు మూడింట రెండొంతులు పూర్తి చేసుకున్నట్లు ఇస్రో వెల్లడించింది. చంద్రయాన్-3ని జులై 14న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా విజయవంతంగా భూకక్ష్యలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మరుసటిరోజు తొలిసారిగా దీని కక్ష్యను పెంచారు. ఇలా 18 రోజుల వ్యవధిలో దశలవారీగా అయిదుసార్లు కక్ష్యను పెంచారు. అయిదో భూకక్ష్య పూర్తయిన అనంతరం.. ఈ నెల1న 'ట్రాన్స్ లూనార్ కక్ష్య'లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అనుకున్నట్లుగానే అంతా సజావుగా సాగితే ఆగస్టు 23న సాయంత్రం చంద్రుడిపై ల్యాండర్ అడుగుపెట్టనుంది.

రాహుల్‌కు ఊరట

పరువు నష్టం కేసులో దోషిగా నిర్ధారణపై సుప్రీం స్టే



- ఎంపి సభ్యత్వ పునరుద్ధరణకు మార్గం సుగమం
- కాంగ్రెస్ పార్టీ హర్షం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. మోడీ ఇంటి పేరుపై వ్యాఖ్యలకు సంబంధించిన 2019 నాటి కేసులో దోషిగా రాహుల్‌ను దోషి గా నిర్ధారిస్తూ రెండేళ్ల జైలు శిక్ష విధించిన గుజరాత్ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం నిలిపేసింది.దీంతో రాహుల్ లోక్ సభ సభ్యత్వ పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. రాహుల్ సభ్యత్వపునరుద్ధరణపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇప్పుడు ప్రకటన వెలువరించాల్సి ఉంది. సుప్రీం కోర్టు ఆదేశం దరిమిలా రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికే స్పీకర్‌ను కోరారు. "దొంగలందరికీ మోడీ ఇంటిపేరు ఎందుకుంటుంది' అనే వ్యాఖ్యలకు గాను క్రిమినల్ పరువు నష్టం కేసులో తనపై విధించిన రెండేళ్ల జైలు శిక్షను రద్దు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

ఈ పిటిషన్‌ను జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ పివి సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. భారత శిక్షాస్మృతి (ఐపిసి) ప్రకారం పరువు నష్టం కలిగించే నేరానికి సంబంధించి రెండేళ్ల గరిష్ట జైలు శిక్ష విధించేందుకు ట్రయల్ కోర్టు నిర్దిష్ట కారణాలేవీ చూపలేకపోయిందని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. శిక్ష ఒక రోజు తక్కువగా ఉంటే, నిబంధనలు (అనర్హతకు సంబంధించినవి) వర్తించవు. సెషన్స్ కోర్టు, గుజరాత్ హైకోర్టు భారీ పేజీలు తీర్పు ఇచ్చినప్పటికీ, ఈ అంశాల జోలికి వెళ్లలేదు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ తరహా వ్యాఖ్యలు మంచివి కావన్న విషయంపై సందేహమే లేదు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి బహిరంగ ప్రసంగాలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అందరూ ఆశిస్తారు' అని ధర్మాసనం పేర్కొంది.

రాహుల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ పరువు నష్టం దావా వేసిన గుజరాత్ చెందిన బిజెపి ఎమ్మెల్యే పూర్ణేశ్ మోడీ అసలు ఇంటిపేరు 'మోడి' కాదని, ఆయన ఆ ఇంటిపేరును తరువాత పెట్టుకున్నారని అన్నారు. . పార్లమెంట్‌కు హాజరయ్యేందుకు, ఎన్నికల్లో పోటీ చేసేందుకుగానూ, నిర్దోషిగా విడుదలయ్యేందుకు రాహుల్ ఇదే చివరి అవకాశమని తెలిపారు. పూర్ణేష్ మోడీ తరపున సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ వాదనలు వినిపిస్తూ మోడీ ఇంటిపేరుతో అందరి పరువు తీయడమే రాహుల్ అసలు ఉద్దేశమని అన్నారు.

2019లో కర్ణాటకలోని కోలార్ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటి పరారీలో ఉన్న వ్యక్తులతో ముడిపెట్టి దొంగలందరి ఇంటి పేరు మోడీ ఎలా అవుతోందంటూ రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. దీనిపై గుజరాత్‌కు చెందిన బిజెపి ఎమ్మెల్యే పరువు నష్టం కేసు వేయగా, మార్చి 23న సూరత్ కోర్టు జడ్జి హదీరాష్ వర్మ 168 పేజీల సుదీర్ఘ తీర్పులో రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి, రెండేళ్ళ జైలు శిక్ష విధించడంతో ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దు అయింది. తన నేరారోపణను నిలిపివేయాలని కోరుతూ రాహుల్ వేసిన పిటిషన్‌ను సూరత్‌లోని సెషన్స్ కోర్టు ఏప్రిల్ 20న తోసిపుచ్చింది. సూరత్ కోర్టు తీర్పును రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టులో సవాల్ చేశారు. అక్కడ ఆయనకు ఉపశమనం మిగతా 5లో



తగులబడుతున్న పోలీస్ వాహనాలు



టిడిపి శ్రేణులపై లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

బాబు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

వైసిపి వర్సస్ టిడిపి • పోలీసులపై రాళ్లదాడి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తలపెట్టిన 'ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధ భేరీ' యాత్రలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసిపి, టిడిపి శ్రేణులు పరస్పరం దాడులకు దిగాయి. రాళ్లదాడులు, వాహనాలను తగలబెట్టడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లు గ్రామం వద్ద తొలుత ఘర్షణ ప్రారంభమైంది. ఆ గ్రామంలో చంద్రబాబును అడ్డుకోవడానికి వైసిపి కార్యకర్తలు ప్రయత్నిండంతో పాటు కాన్వాయ్‌పై రాళ్ల దాడి చేయడంతో ప్రారంభమైన ఉద్రిక్తత చిత్తూరు జిల్లాకూ వ్యాపించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పుంగనూరు వద్ద పోలీసులు లాఠీఛార్జీ చేయడంతో పాటు, భాష్పవాయువు ప్రయోగించారు. ఈ దాడుల్లో ఒక ఎస్‌ఐతో పాటు రెండు పార్టీలకు చెందిన పలువురికి తీవ్ర గాయాలైనాయి. ఈ పరిస్థితికి కారణం మీరంటే మీరని రెండు పార్టీల నాయకులు ఆరోపణలకు దిగారు. శనివారం నాడు చిత్తురు జిల్లా బంద్‌కు వైసిపి పిలుపునిచ్చింది.

- రణరంగంగా పుంగనూరు
- లాఠీఛార్జి, భాష్పవాయువు ప్రయోగం
- పాలసముద్రం ఎస్‌ఐ సహా పలువురికి గాయాలు
- నేడు చిత్తూరు జిల్లా బంద్‌కు వైసిపి పిలుపు

ప్రజాశక్తి- పుంగనూరు (చిత్తూరు జిల్లా), కురబలకోట (అన్నమయ్య జిల్లా)


శుక్రవారం ఉదయం నుండే పుంగనూరులో వైసిపి శ్రేణులు బాబు పర్యటనకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించాయి. ఉదయం 11 గంటలకు నల్ల జెండాలతో ప్రదర్శనలు చేయడంతో పాటు, చంద్రబాబు గో బ్యాక్ అంటూ ప్లకార్డులను వైసిపి కార్యకర్తలు ప్రదర్శించారు. మరోవైపు చంద్రబాబుకు పుంగనూరు పట్టణంలోకి అనుమతి లేదని, బైపాస్ రోడ్డుపైన ఆయన చిత్తూరుకు వెళ్లాలని చెబుతూ పోలీసులు బ్యారికేడ్లు అడ్డం పెట్టారు. అప్పటికే అన్నమయ్య జిల్లాలో వైసిపి కార్యకర్తలు చేసిన దాడి విషయం తెలియడంతో టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కృష్ణదేవరాయ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ ఆందోళనకు దిగారు. పుంగనూరులోకి అనుమతి ఇచ్చేది లేదని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో, పోలీసులకు, టిడిపి శ్రేణులకు మధ్య వాగ్వివాదం జరిగింది. టిడిపి శ్రేణులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ సమయంలో పోలీసులపై రాళ్లదాడి జరిగింది. కొందరు పోలీస్ వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ దాడిలో పాలసముద్రం ఎస్‌ఐ ప్రసాద్‌తో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తేవడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. గాయపడిన పోలీసులను ప్రథమ చికిత్స నిమిత్తం పుంగనూరు ఆస్పత్రికి తరలించారు. ఉద్రిక్తత నేపథ్యంలో ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని జనం భయం గుప్పిట్లో ఇళ్లల్లో తలుపులు వేసుకునే ఉన్నారు. షాపులు మూసేశారు. దాదాపు 500 మంది పోలీసులు పుంగనూరులో మోహరించారు. ఈ సంఘటనలన్నీ చంద్రబాబు నాయుడు రాక మునుపే జరిగిపోయాయి. సాయంత్రం 5.30 గంటల తర్వాత బైపాస్ రోడ్డులోని ఓ గ్రామంలో పర్యటించి చిత్తూరుకు వెళ్లారు.

పోలీసులపై దాడి చేసిన వారిని ఉపేక్షించేది లేదు : ఎస్‌పి

పోలీసులపై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి రిశాంత్ రెడ్డి హెచ్చరించారు. చంద్రబాబు టూర్ షెడ్యూల్ ప్రకారం పుంగనూరులోకి రావడానికి ఎటువంటి అనుమతీ తీసుకోలేదన్నారు. వారు ఇచ్చిన కార్యక్రమం ప్రకారమే 400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేశామని తెలిపారు. పుంగనూరులోనికి రాకుండా హైవేపై చిత్తూరుకు వెళ్లాల్సి ఉందన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పుంగనూరులోకి రానీయకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అయినా, కొందరు అల్లరి మూకలు దౌర్జన్యంగా మిగతా 5లో

రైతులకు చేయూతలో ఆప్కాబ్ పాత్ర అద్వితీయం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



డివిడెండ్ చెక్ నమూనాను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్, ఆప్కాబ్ సిబ్బంది

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు బ్యాంకింగ్ సేవలను అందించే అంశంలో ఆప్కాబ్ పాత్ర అద్వితీయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు (ఆప్కాబ్) వజ్రోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి సిఎం జగన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు నూతన లోగో, పోస్టల్ స్టాంపును ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఆప్కాబ్ నిలబడిన పరిస్థితి చూస్తే గర్వంగా ఉందన్నారు. సహకార రంగం 60 ఏళ్ల పూర్తి చేసుకోవడం గొప్ప విషయమన్నారు. చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతికి ఆప్కాబ్ ఎంతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. 2008 ఖరీఫ్ నుంచి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించే కార్యక్రమానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2019లో నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసు అయిన నాబ్‌కాన్స్ (నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) చేసి ఆప్కాబ్‌ను మరింత మెరుగైన పరిస్థితిలోకి తీసుకెళ్లేలా చర్యలను చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో సహకార సంఘాలు, రైతుల ప్రస్తుత పరిస్థితి, అవసరాలకు అనుగుణంగా 1964 నాటి చట్టాన్ని సవరించామని చెప్పారు. అనంతరం కో-ఆపరేటివ్ గవర్నెన్స్‌ను మరింత మెరుగుపరుస్తూ ఆప్కాబ్‌లో డిసిసిబిలలో ప్రొఫెషనల్స్ కూడా ఉండేటట్టు మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఈ చర్యల వల్ల పారదర్శకత, సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. డిసిసిబిల సిఇఒల ఎంపిక కూడా రాష్ట్రస్థాయిలో ఒక కామన్ సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం షేర్ కేపిటల్ కింద రూ.295 కోట్లు ఇచ్చిందన్నారు. ఆప్కాబ్‌ను డిసిసిబిలను అనుసంధానం చేస్తూ మొత్తం డిజిటలైజేషన్‌ను తెస్తున్నామని అన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో సహకార బ్యాంకుల వాణిజ్య కార్యకలపాలు 24 శాతం పెరిగాయన్నారు. 2019 మార్చి 31 నాటికి రూ.53,249 కోట్లుగా ఉన్న సహకార బ్యాంకుల పరపతి ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.1,05,089 కోట్లకు చేరిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఏలూరు మినహా అన్ని డిసిసిబిలు లాభాల్లోకి వచ్చాయన్నారు. గ్రామీణ వ్యవస్థలో రైతు, గ్రామం రెండూ బాగుండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్‌బికెలకు సహకార సంఘాలను అనుసంధానం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, జోగి రమేష్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రైతుల కౌలు నగదు రూ.200 కోట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం రూ.200 కోట్లను విడుదల చేసింది. ఈ విషయాన్ని హైకోర్టుకు సిఆర్‌డిఎ తెలిపింది. ఈ మొత్తం సిఎంఎఫ్‌ఎస్ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు వివరించింది. దీనిపై జస్టిస్ బి కృష్ణమోహన్ స్పందిస్తూ.. కౌలు చెల్లింపులపై నివేదికను ఈ నెల 10న జరిగే విచారణ సమయంలో తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. రైతులకు వార్షిక కౌలు చెల్లించకపోవడంపై పోతినేని శ్రీనివాస్‌రావు అనే రైతు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు సిఆర్‌డిఎ పై వివరాలను నివేదించింది.


రేషన్‌కు కోత!

- మూడు నెలలుగా ఆగిన కందిపప్పు పంపిణీ
- బహిరంగ మార్కెట్లో పెరిగిన ధర
- సరఫరా సంస్థలు నిలిపివేతే కారణమంటూ ప్రభుత్వం ప్రచారం

2

3 వారాల్లో కౌంటర్ దాఖలు చేయకపోతే జరిమానా తప్పదు

ఎపి, తెలంగాణ ఆస్తుల విభజనపై కేంద్రానికి సుప్రీం హెచ్చరిక



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనపై కౌంటర్ దాఖలు చేయకుంటే జరిమానా విధిస్తామని కేంద్రాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఉమ్మడి ఆస్తుల విభజనలో జరుగుతున్న జాప్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఎపి తరపు సీనియర్ న్యాయవాది మహ్‌ఫూజ్ నజ్కీ వాదనలు వినిపిస్తూ రెండు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనకు ఇటీవల పదవీ విరమణ చేసిన జస్టిస్ రామసుబ్రమణియను మధ్యవర్తిగా నియమించాలని కోరారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్, న్యాయవాది పీచర శ్రీహర్ష అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తమ వైఖరి తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని, కేంద్రం కౌంటర్ దాఖలు చేసిన తరువాత దాని ఆధారంగా విచారణలో ఆ అంశంపై వాదనలు వినిపిస్తామని ధర్మాసనానికి తెలిపారు. దీంతో గత మే నెలలోనే కౌంటర్ దాఖలుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చామని, ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయకపోవడం సరికాదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, చివరిసారిగా అవకాశం ఇస్తున్నామని తెలిపింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం కౌంటర్‌కు రిజాయిండర్ల దాఖలు రెండు రాష్ట్రాలకు మరో మూడు వారాల గడువును ధర్మాసనం ఇచ్చింది.

రాష్ట్రంలో విధ్వంసాలకు కుట్ర

- చంద్రబాబు రెచ్చగొట్టడంతోనే ఈ ఘర్షణలు
- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో పర్యటనల పేరుతో చంద్రబాబు నాయుడు విధ్వంసాలు జరిగేలా కుట్రలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లాలో జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా టిడిపి శ్రేణులు రెచ్చిపోయి కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డారని అన్నారు. పుంగనూరులో ముందుగానే రాళ్లు, కర్రలను వాహనాల్లో పెట్టుకుని వచ్చారన్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తే వారిపైనా దాడులు చేశారని అన్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు తీవ్రగాయాలయ్యాయని పేర్కొన్నారు. అలాగే పోలీసుల వాహనాలకు కూడా నిప్పటించారంటే వారు ఎంతటి హింస సృష్టిస్తున్నారో అవగతమవుతోందన్నారు. చంద్రబాబు ఎంత రెచ్చగొట్టినా వైసిపి శ్రేణులు సంయమనంతో వుంటున్నారని తెలిపారు. చంద్రబాబు గొడవలు సృష్టిస్తున్నారని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని అన్నారు. రాయలసీమలో జరుగుతున్న అన్ని గొడవలకూ చంద్రబాబే బాధ్యత వహించాలన్నారు. చంద్రబాబు కుట్రలను కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మొబైల్ రక్త సేకరణ బస్సులు

- జెండా ఊపి ప్రారంభించిన గవర్నరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐఆర్‌సిఎస్ ఎపి స్టేట్ బ్రాంచ్‌కు చెందిన రెండు మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సులను శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సులను అనంతపురం, చిత్తూరు జిల్లాల ఐఆర్‌సిఎస్ శాఖలకు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా గవర్నరు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 18 రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులు నడుస్తున్నాయని, వీటితోపాటు అదనంగా నరసరావుపేట, తిరుపతి, భీమవరంలలో మరో మూడు బ్లడ్ బ్యాంకులను ఏర్పాటుచేసి తలసేమియా వ్యాధిగ్రస్తులకు, పేదలకు రక్తం సరఫరా చేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ శ్రీధర్‌రెడ్డి, ఎకె కెనడియన్, ఐఆర్‌సిఎస్ ఎపి స్టేట్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీ పరీధా పాల్గొన్నారు.

నూతన జోన్ల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన జిల్లాలతో జోన్లు, మల్టీ జోన్లు ఏర్పాటు చేసేందుకు "రాష్ట్రపతి ఉత్తర్వులు 1975" కు సవరణ చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది.

సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ రాష్ట్రపతి ఉత్తర్వులు సవరణకు సంబంధించిన స్థానికత, నూతన జోనల్ విధానం తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి. సత్య ప్రభాకర్ రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి కృష్ణబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

'టర్కీ 7.8' పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రముఖ జర్నలిస్టు రెహన రచించిన 'టర్కీ 7.8' పుస్తకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో భూకంప తీవ్రతకు నష్టపోయిన టర్కీపై తాను స్వయంగా చూసిన అంశాలను పుస్తక రూపంలో తీసుకొచ్చానని సిఎంకు రెహన వివరించారు. జర్నలిస్టుగా వాస్తవ సంఘటనలను వెలుగులోకి తీసుకొచ్చిన రెహనను సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సమాచారశాఖ కమిషనరు టి విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రేషన్‌కు కోత!

- మూడు నెలలుగా ఆగిన కందిపప్పు పంపిణీ
- బహిరంగ మార్కెట్లో పెరిగిన ధర
- సరఫరా సంస్థలు నిలిపివేతే కారణమంటూ ప్రభుత్వం ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జూన్, జులైలో లబ్ధిదారులకు కందిపప్పు ఇవ్వలేదు. కనీసం ఆగస్టులోనైనా ఇస్తుందని కార్డుదారులు ఆశించారు. ఈ నెలకు సంబంధించి జిల్లాలకు కందిపప్పు ఇచ్చే పరిస్థితి లేదు. రెండు నెలలకు సంబంధించిన కందిపప్పును ఆగస్టు నెల రేషన్‌తో కలిపి ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఇటీవల ప్రకటించినా, లబ్ధిదారులకు కందిపప్పు ఇవ్వడం లేదు. రాష్ట్రానికి కందిపప్పు సరఫరా చేస్తున్న నాగపూర్, రాయ్‌పూర్‌కు చెందిన పంపిణీ సంస్థలు ఆపేయడం వల్లే కందిపప్పు రాలేదని తెలుస్తోంది. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణమని సమాచారం. దీంతోపాటు రిలయన్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 200 మార్టుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పెద్ద ఎత్తున కందిపప్పు సేకరిస్తోంది. ఫలితంగా రిటైల్ దుకాణాలకు సైతం కందిపప్పు అందించలేకపోతున్నామని హోల్‌సేల్ వ్యాపారులు చెప్తున్నారు. రిటైల్ దుకాణాలకు సరుకు తగ్గడం, ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. జూన్‌లో మొదటి రకం కందిపప్పు కేజీ రూ.132 ఉండగా, ప్రస్తుతం రూ.142కు, సాధారణ రకం కందిపప్పు రూ.118 ఉండగా, ప్రస్తుతం రూ.127కు చేరింది.

కేంద్రం తీరుతో లబ్ధిదారులకు అవస్థలు

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1,47,30,744 రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రేషన్ సరుకులను అందిస్తోంది. వీటిద్వారా 4,29,27,827 మంది పేదలు లబ్ధి పొందుతున్నారు. ఈ నెలలో గురువారం నాటికి 35,178 మెట్రిక్ టన్నుల బియ్యం, 1,672 టన్నుల పంచదార ఇచ్చారు. 328 టన్నుల గోధుమపిండి అందించారు. రేషన్ పంపిణీలో కేంద్ర ప్రభుత్వ సూచనలతో గత నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెండుసార్లు వేలిముద్రల విధానంతో అటు పేదలు, ఇటు ఎండియు ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నా యోజన (పిఎంజికెఎవై) కింద కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తుండడంతో, వాటి వరకు ప్రత్యేకంగా పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. దీంతో, ఆపరేటర్లు బియ్యం కోసం ఒకసారి, ఇతర సరుకులకు మరోసారి వేలిముద్ర తీసుకుంటున్నారు. ఫలితంగా ఎక్కువ సమయం పడుతోంది. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు క్యూలో నిల్చోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను అధిగమించడానికి ఆపరేటర్లు అందరికీ ఒక విడతలో బియ్యం ఇచ్చి, పంచదార, గోధుమపిండి సరుకులను రెండో విడతలో వీధుల్లోకి వాహనం వచ్చినప్పుడు ఇస్తామంటూ పంపిస్తున్నారు. దీంతో, కొంతమంది పంచదార, ఇతర సరుకులకు నోచుకోవడం లేదు. జూన్‌లో పాత విధానంలో పంచదార ఇచ్చినప్పుడు 50,83,716 కార్డుదారులకు పంచదార ఇవ్వగా, రెండుసార్లు వేలిముద్రలు అమల్లోకి వచ్చిన తర్వాత జులైలో 48,14,108 మంది మాత్రమే పంచదార తీసుకోగలిగారు. రెండుసార్లు వేలిముద్రలతో తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ఎండియు ఆపరేటర్లు జాయింట్ కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఈ నెలలోనూ అదే పద్ధతిలో అందిస్తున్నారు.



బూర్జలో రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

నియంతృత్వానికి పరాకాష్ట

- అంగళ్లు ఘటనపై టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నమయ్య జిల్లా అంగళ్లులో టిడిపి కార్యకర్తలపై వైసిపి దాడి నియంతృత్వానికి పరాకాష్ట అని టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతల పర్యటనలను చూసి జగన్ భయపడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల పర్యటనలకు ప్రజలు వేలాదిగా తరలిస్తుండటంతో వారిని భయభ్రాంతులకు గురిచేసేలా జగన్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. తాడేపల్లి పెద్దల ఆదేశాల మేరకు దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. శాంతిభద్రతలను కాపాడటంతో పోలీసులు చేతులెత్తేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదన్న విషయం ఆ సంఘటన ద్వారా మరోసారి బట్టబయలైందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి వాస్తవాలు చెబితే వైసిపి నేతలు జీర్ణించుకోలేక ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన పాపాలు పండే రోజులు దగ్గరపడిందని ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు.

పర్యటనను అడ్డుకునేందుకు దాడులకు దిగడం మంత్రి ఎంత అభద్రతలో ఉన్నారో అర్థమవుతోందన్నారు. పులివెందులలో చంద్రబాబుకు లభించిన ప్రజాధరణతో జగన్‌కు వెన్నులో వణుకు మొదలైందని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. అధికార బలంతో అరాచకం సృష్టిస్తే ప్రజాకోర్టులో శిక్ష తప్పదని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు.

చంద్రబాబు, లోకేశ్‌కు భద్రతపై నివేదిక కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : టిడిపి అగ్రనాయకులు నారా చంద్రబాబు, నారా లోకేశ్‌కు కల్పిస్తున్న భద్రతపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ నివేదిక కోరింది. జడ్‌ప్లస్ భద్రత ఉన్న చంద్రబాబు కాన్వాయ్‌పై ఇటీవల దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశారు. భద్రత కల్పనలో రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం విఫలమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హోంశాఖ.. గత ఏడాది నవంబరు 4న చంద్రబాబు ర్యాలీలో రాళ్ల దాడిపై నివేదిక కోరింది. అలాగే, పర్యటనల సందర్భంగా చంద్రబాబు లోకేశ్‌కు భద్రత కల్పించాలని డిజిపి, సిఎస్‌ను ఆదేశించింది. ఈ మేరకు జులై 27న ఏపీ ప్రభుత్వానికి కేంద్ర హెూంశాఖ లేఖ రాసినట్టు సమాచారం.

సాహితీవేత్త వేదయ్య కన్నుమూత

ప్రజాశక్తి-గుంటూరు



ప్రముఖ సాహితీవేత్త, కవి, కళాపోషకుడిగా ప్రసిద్ధి చెందిన కమర్షియల్ ట్యాక్స్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ బిళ్లా వేదయ్య (88) గురువారం రాత్రి గుంటూరులోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వేదయ్య భౌతికకాయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, మద్యవిమోచన ప్రచార కమిటీ మాజీ చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి, కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టారు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కవులు, సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో సందర్శించి నివాళులర్పించారు. వేదయ్య మరణం సాహితీలోకానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. 88 ఏళ్ల జీవిత కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన వేదయ్య చిరస్మరణీయులని కొనియాడారు. కమర్షియల్ ట్యాక్స్‌లో 1995లో పదవీ విరమణ పొందిన తర్వాత సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌లో పని చేశారు. సాహితీ సేవలో అనేక సంస్థలకు ఆర్థిక చేయుత అందించారు. పాశం రామారావు మాట్లాడుతూ కళాకారులను నిరంతరం ప్రోత్సహించడమే కాకుండా, స్వతహాగా వేదయ్య అనేక నాటికలు, నాటకాలు వేయడం, పాత్రల్లో జీవించేవారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆయన అభ్యుదయ భావాలతో సమసమాజం రావాలని కోరుకునే వారన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

జగన్‌పై సమిష్టి పోరాటం

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అందరమూ సమిష్టిగా పోరాడుదామని, బెదిరింపులకు లొంగిపోని బలమైన రాజకీయాలు చేద్దామని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో చాలా గొడవలు జరిగే అవకాశముందని, జగన్ అధికార దండాన్ని వేరే వాళ్లకు ఇవ్వడానికి ఇష్టపడే వ్యక్తి కాదని అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశముందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దోపిడీ విశ్వరూపం చూపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో యువతకు అవకాశాలు ఎక్కువగా ఇవ్వనున్నట్లు పవన్‌కల్యాణ్ వెల్లడించారు. విశాఖలో వారాహి యాత్ర ప్రభంజనం కావాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

చంద్రబాబుపై దాడిని ఖండించిన పవన్ కల్యాణ్

రాష్ట్రంలో వైసిపి సర్కారు వైఖరి ప్రతిపక్షం గొంతునొక్కేలా ఉందని, పుంగనూరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు వాంఛనీయం కాదని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు రాళ్ల దాడులకు పాల్పడటం, వాహనాలు ధ్వంసం చేయడం ద్వారా వైసిపి హింసా ప్రవృత్తిని తెలియజేస్తోందన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలను నివారించాలని, డేటా చౌర్యంపై కేంద్ర హోంశాఖ విచారణ చేపట్టాలని జనసేన పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో కొణిదెల నాగబాబు, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తోపాటు 26 జిల్లాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, కీలక నేతలు పాల్గొన్నారు.

హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు

- జిఓనెం. 77 జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో నిర్దిష్ట వర్గాలకు హారిజాంటల్ రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబర్ 77ను జారీ చేసింది. గతంలో ఉన్న పలు రిజర్వేషన్ల ఉత్తర్వుల్లో సవరణలు తీసుకువస్తూ తాజాగా సాధారణ పరిపాలన శాఖ నిర్ణయం తీసుకుంది. 1975, 2007, 2010 సంవత్సరాల్లో పలు రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, ఆ తరువాత 1996లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్వీసు రూల్స్‌లలో ఉన్న నిబంధనలను తాజా ఉత్తర్వుల్లో సవరించారు.

మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు, విశేష ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారికి తాజా రిజర్వేషన్లు వర్తిస్తాయి. పాత నిబంధనల్లోని క్లాజ్ 22ను సవరిస్తూ తక్కువ దృష్టి కలిగిన వారు, చెవిటి, మూగ, కుష్టు, ఆసిడ్ దాడుల్లో బాధితులతో పాటు మరికొన్ని అనారోగ్య బాధితులను కూడా జాబితాలో చేర్చారు. ఎస్సీ వర్గానికి చెందిన వారు తమ విద్యార్హలతో ఓపెన్ కేటగిరిలో ఉద్యోగం సంపాదిస్తే ఆ ఉద్యోగాలను ఎస్సీ కేటగిరిలో భర్తీ చేసినట్లు చూపించరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మహిళల కోటా భర్తీ సమయంలో కూడా స్పెషల్ రిజర్వేషన్ కోటాలో మెరిట్ మేరకు భర్తీలు జరగాలని, ఎస్సీ కోటాలో 15 మందిని భర్తీ చేయాల్సి ఉంటే అందులోని మెరిట్ లిస్టులో ఐదుగురు మహిళలు ఉండేలా చూడాలని, ఐదుగురు కన్నా తక్కువగా మహిళలు ఉంటే, ఆ తక్కువ సంఖ్యగల మహిళలను ఓపెన్ కేటగిరీ జాబితాలో చేర్చాలని నిర్దేశించారు. ఉద్యోగాల భర్తీ సమయంలో ప్రధానంగా మూడు అంచెల్లో భర్తీ చేయాలని నిర్దేశించారు. తొలి అంచెలో మెరిట్ ఆధారంలో ఓపెన్ కేటగిరిలో, రెండో అంచెగా ఎస్సీ, ఎస్టీ, బిసి, ఆర్థికంగా వెనుకబడిన కేటగిరిలకు, మూడో అంచెగా హారిజాంటల్ రిజర్వేషన్లతో నియామకాలు జరగాలని పేర్కొన్నారు.

సిఎంఓ దొంగలపై సిబిఐతో విచారణ

- టిడిపి నేత వర్ల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ) దొంగలు, అవినీతి పరులతో నిండిపోయిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎంఓ అధికారులకు తెలియకుండానే కిందిస్థాయి ఉద్యోగులు అధికారుల డిజిటల్ సంతకాలతో ఫైల్స్ క్లియర్ చేశారా? అని ప్రశ్నించారు. పోలీసు కేసు పెట్టి ఉద్యోగులను అరెస్టు చేయడం సిఎం జగన్‌కు సిగ్గుచేటని అన్నారు. పై స్థాయి అధికారులను అరెస్టు చేయకుండా కిందిస్థాయి ఉద్యోగాస్తులను అరెస్టు చేయడం సరైందికాదని పేర్కొన్నారు. సిఎంఓ ప్రమేయం లేకుండా దొంగతనంగా క్లియర్ చేసిన ఫైళ్ల వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిఎంఓలోని వసూల్ రాజాకు తెలియకుండా ఏ ఫైల్ ముందుకు నడవదని పేర్కొన్నారు. వసూల్ రాజా అవినీతి సంపాదనపై దర్యాప్తు చేసేందుకు తమ పార్టీ ఇద్దరు రిటైర్డు పోలీసు అధికారులను నియమించిందని తెలిపారు.

రాజధానిని నాశనం చేయడమే జగన్ అజెండా : కొమ్మారెడ్డి

పేదల ముసుగులో రాజధానిని నాశనం చేయడమే సిఎం జగన్ అజెండా అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. సిఆర్‌డిఎ చట్టం, హైకోర్టు తీర్పు, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి నాశనం చేయాలనే కుట్రలో భాగంగా పేదలకు ఇళ్లు అనే నాటకం మొదలుపెట్టారని ఆరోపించారు. జగన్‌కు పేదలకు ఇళ్లు నిర్మించాలనే ఆలోచన నిజంగా ఉంటే తక్షణమే ఆర్-3 జోన్‌లో నిర్మించాలని డిమాండ్ చేశారు.

మార్గదర్శి కేసులో హైకోర్టులోనే తుది వాదనలు వినిపించుకోవాలి

- ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగించిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్ కేసు బదిలీపై ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ముగించింది. తెలంగాణ హైకోర్టులోనే తుది వాదనలు వినిపించుకోవాలని స్పష్టం చేసింది. మార్గదర్శి సంస్థపై ఎపి సిఐడి పోలీసులు నమోదుచేసిన కేసులకు సంబంధించిన అంశాలను విచారించే న్యాయపరిధి తమకు ఉందంటూ తెలంగాణ హైకోర్టు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ నిర్ణయం ఇప్పటికే జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని పేర్కొంది. మార్గదర్శి ఛైర్మన్ రామోజీరావు, ఎమ్‌డి శైలజా కిరణ్‌పై కఠిన చర్యలు వద్దన్న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని తెలిపింది. మార్గదర్శి సంస్థ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఎపి ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్, నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపించారు.

జగజ్జనని చిట్‌ఫండ్ కేసులో అప్పారావుకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జగజ్జనని చిట్‌ఫండ్ కేసులో బెయిల్ మంజూరైన సంస్థ ఎమ్‌డి ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పారావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బెయిల్ అంశాల్లో సాధారణంగా రామని, కానీ ఇది చిట్ ఫండ్ విషయమని, తాము రిమాండ్ రిపోర్టులో అన్ని వివరాలు పేర్కొన్నామని తెలిపారు. అనంతరం ఆదిరెడ్డి అప్పారావుకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మే హక్కు కేంద్రానికి లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. పోరాటాల ద్వారా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 904వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, వైటి.దాసు, జె.రామకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని ఖండించారు. దేశంలో ఒక్క పరిశ్రమనూ నెలకొల్పకపోగా ఉన్న వాటిని అమ్మేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. సుదీర్ఘకాలంగా ఉక్కు పరిరక్షణ పోరాటం కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు శ్రీరామమూర్తి, స్టీల్ సిఐసిసిపి విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో మాట్లాడుతున్న ప్రభావతి

మహిళలపై హింసకు ప్రభుత్వాలే కారణం

- బిజెపి హయాంలో పెరిగిన అఘాయిత్యాలు
- కొనసాగిన మహిళా పోరుయాత్ర

ప్రజాశక్తి - భీమవరం, ఆలూరు

మహిళలు, చిన్నారులపై దాడులు, దౌర్జన్యాలు అధికమవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపకుండా హింసను ప్రోత్సహించడం సిగ్గుచేటని ఐద్వా నాయకులు విమర్శించారు. రోజురోజుకీ మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న హింసను ప్రభుత్వాలు అరికట్టాలని, లేనిపక్షంలో తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభమైన 'మహిళా పోరుయాత్ర' శుక్రవారం అనంతపురం మీదుగా కర్నూలుకు, విశాఖలో ప్రారంభమైన యాత్ర పశ్చిమగోదావరి జిల్లా మీదుగా ఏలూరులోకి ప్రవేశించింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో పోరు యాత్రకు ఘనస్వాగతం లభించింది. నరసాపురం, భీమవరం, తాడేపల్లి గూడెం, సీతారాంపేటలో నిర్వహించిన సభల్లో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడారు. మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళలపై హింస మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలోనూ మహిళలపై ఇదే తరహాలో దాడులు జరుగుతున్నాయని తెలిపారు. 2020లో కంటే 2021లో 25 శాతం నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, పంచాయతీ కార్మికులు పోరుయాత్రకు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. కర్నూలులో ఇందిరాగాంధీ సెంటర్, సిల్వర్‌జూబ్లీ కళాశాలలో నిర్వహించిన సభల్లో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడారు. మద్యాన్ని నిషేధించి మహిళల కళ్లలో ఆనందాన్ని నింపుతామని అధికారంలోకి రాక ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని, నేడు మద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పాలన సాగించడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రాష్ట్ర నాయకులు స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- టోల్ ఫ్రీ నెంబరు 1930 ఏర్పాటు
- సిఐడి ఎస్‌పి హర్షవర్ధన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని సిఐడి ఎస్‌పి హర్షవర్ధన్ సూచించారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు 1930 టోల్‌ఫ్రీ నెంబరును చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాలో ఇటీవల అసభ్య ట్రోలింగ్స్ ఎక్కువయ్యాయని అన్నారు. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం దేశంలో 2021లో 52,972 సైబర్ నేరాలు నమోదైతే, రాష్ట్రంలో 1,885 కేసులు రికార్డయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను ప్రత్యేకంగా విచారించేందుకు సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. సైబర్ నేరాలపై అడుకట్ట వేసేందుకు ప్రజల్లో చైతన్యం అవసరమని, అందుకే టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశామని అన్నారు. విశాఖలో అక్టోబరు 7, 8 తేదీల్లో సైబర్ హ్యాకథన్ నిర్వహిస్తామని చెప్పారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు బిఇ డిగ్రీ ప్రోగ్రాం

- సాంకేతిక విద్య కమిషనరు నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియా సంస్థ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో అందిస్తున్న బిఇ (ట్రైనింగ్ ఇంటిగ్రేటెడ్) డిగ్రీ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ కాలపరిమితిని ఆగస్టు 11 వరకు పొడిగించామని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ డిగ్రీని కొనసాగిస్తూ, పరిశ్రమకు అవసరమైన పూర్తిస్థాయి శిక్షణను పొందగలిగేలా ఈ కోర్సును రూపొందించారని తెలిపారు. కాంచీపురంలోని విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఈ కోర్సు అందుబాటులో ఉందని వివరించారు. అత్యంత విలువైన పారిశ్రామిక శిక్షణ పొందుతూ, ఇంజినీరింగ్ పట్టా పొందగలిగిన ఈ కోర్సు విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మరింత సమాచారం, నమోదు వివరాల కోసం cfa.annauniv.edu/cfa/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఎఫ్‌డిఆర్ సాంకేతికత వాడండి

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్ల కోత నివారణకు ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డిఆర్) సాంకేతికతను వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. రహదారుల నిర్మాణంపై ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులతో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెత్తటి నేలల్లో రోడ్లు నిర్మిస్తున్నా, వర్షాలు పడినా, వరదలు వంటి విపత్తులు వచ్చినా నదీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు తరచూ కోతకు గురవుతున్నాయన్నారు. ఇకపై రోడ్లను రీసైక్లింగ్ చేయడం ద్వారా వనరుల కొరతతోపాటు వాటి జీవితకాలాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఫుల్ డెప్త్ రిక్లమేషన్ విధానంలో పాత రోడ్డును యంత్రాల సాయంతో రెండు నుంచి మూడు అడుగుల లోతు తవ్వకాలు జరుపుతారని, ఆ తర్వాత సిమెంట్, కెమికల్‌తో మిక్స్ చేసి చదును చేస్తారని, ఆపై ఒకదానిపై మరొక లేయర్‌ను నిర్మిస్తారని పేర్కొన్నారు. దీంతో రోడ్ల మన్నిక ఎక్కువ రోజులు వుంటుందన్నారు. సాధారణ రోడ్ల కంటే 15 నుంచి 20 ఏళ్లు చెక్కు చెదరకుండా వుంటాయని అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలంటే ముడిసరుకుల రవాణాకే ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి వుంటుందని అన్నారు. నల్ల రేగడి భూములు ఎక్కువగా ఉండే గోదావరి జిల్లాలు, డెల్టా ప్రాంతాలకు ఈ టెక్నాలజీ వరంగా మారబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి ఇంజినీర్లు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- విజయవాడ రైల్వే డిఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పటేల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వే స్టేషన్ల అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని విజయవాడ రైల్వే డిఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పటేల్ పేర్కొన్నారు. విజయవాడ డిఆర్‌ఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద విజయవాడ డివిజన్‌లో 11 స్టేషన్ల రీ డెవలప్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఫేజ్-1లో అనకాపల్లి, భీమవరం టౌన్, ఏలూరు, కాకినాడ టౌన్, నరసాపూర్, నిడదవోలు, ఒంగోలు, సింగరాయకొండ, తాడేపల్లిగూడెం, తెనాలి, తుని స్టేషన్లను సుమారు రూ.270 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫేజ్-2లో మరో 9 స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

విద్యుత్ జెఎసితో చర్చలు విఫలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ అధికారులు, విద్యుత్ ఉద్యోగుల జెఎసి మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. ఉద్యోగుల డిమాండ్లపై ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి జె పద్మజనార్దన్ రెడ్డి శుక్రవారం విద్యుత్ సౌధలో చర్చలు జరిపారు. జెఎసి ప్రతిపాదించిన 12 డిమాండ్లపై సుదీర్ఘ చర్చ జరిగింది. పిఆర్‌సి ఫిట్‌మెంట్ 8 శాతానికి ఇచ్చేది లేదని అధికారులు జెఎసి నాయకులకు తెలిపారు. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు. ఫిట్‌మెంట్ కనీసం 10 శాతంపైన ఉండాలని చెప్పారు. కేడర్ స్కేల్ అమలు చేస్తామని అధికారులు ప్రతిపాదనకు కూడా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలా కాకుండా తెలంగాణ రాష్ట్రం అమలు చేసినట్లు సింగిల్ మాస్టర్ స్కేల్ అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వాటిల్లో ఒక డిఎను త్వరలోనే చెల్లిస్తామని అధికారులు తెలిపారు. జెఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామన్నారు. ప్రధానంగా ఫిట్‌మెంట్, మాస్టర్ స్కేల్‌పై తేలకపోవడంతో శనివారం మరోసారి చర్చలు జరపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జెఎసి చైర్మన్ పి చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య విద్య సీట్ల వ్యాపారం ఆపాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గుంటూరులో నిరసన

ప్రజాశక్తి - గుంటూరు

వైద్య విద్య సీట్ల భర్తీలో వ్యాపారానికి ఎర్ర తివాచీ పరిచి పేదలకు విద్యను దూరం చేసే విధానాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలల్లో సీట్లను అమ్ముకునేందుకు విడుదల చేసిన జిఒ 107, 108కి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఈ జిఒలను ఉపసంహరించుకోకపోతే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కొత్తగా ఏర్పాటు చేసిన కాలేజీల్లో 750 సీట్లు మంజూరు చేశారని తెలిపారు. వాటిలో 15 శాతం (113 సీట్లు) ఆలిండియా కోటాలో భర్తీ చేస్తారన్నారు. మిగిలిన 637 సీట్లలో 50 శాతం (319 సీట్లు) జనరల్ కేటగిరిలో భర్తీ చేసి మిగిలిన 318 సీట్లలో 223 సీట్లను బి కేటగిరీ కింద సంవత్సరానికి రూ.12 లక్షల చొప్పున అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. అదే విధంగా మరో 95 సీట్లను సి కేటగిరి పేరుతో ఏడాదికి రూ.20 లక్షల చొప్పున ఎలాంటి నిబంధనలూ పాటించకుండా ఎవరికైనా విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వడం పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనని విమర్శించారు. తెలంగాణలో కొత్తగా ప్రారంభిస్తున్న వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలోనే సీట్లు భర్తీ చేస్తున్నారని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని చెబుతున్న మన రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యలో సీట్లను అంగడి సరుకు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బి.పద్మ, ఎస్.కె.సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దాడిశెట్టి రాజాకు మాతృవియోగం

ప్రజాశక్తి - కోటనందూరు (తూర్పుగోదావరి)


సత్యనారాయణమ్మ (ఫైల్)

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి దాడిశెట్టి సత్యనారాయణమ్మ (65) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. తల్లి మరణ వార్త తెలుసుకున్న మంత్రి విజయవాడ నుంచి హుటాహుటిన తన స్వగ్రామమైన కాకినాడ జిల్లా తుని మండలం సూరవరానికి చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. సత్యనారాయణమ్మకు భర్త, కుమార్తె, కుమారుడు రాజా ఉన్నారు. పలువురు ఎంపిలు, ఎమ్మెల్సీలు, వైసిపి నాయకులు సంతాపం తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి పురందేశ్వరి విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనలో జరిగిన ఘటనలే ఇందుకు సాక్ష్యమని అన్నారు. ఈ ఘటనను ఖండిస్తున్నామని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి తరహా సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని అన్నారు.

మాకేదీ ఉద్యోగ భద్రత?

- టెండర్ విధానాన్ని రద్దు చేయాలి
- పంచాయతీ, గ్రీన్ అంబాసిడర్ల రాష్ట్ర వ్యాప్త ఆందోళన



సత్యసాయి జిల్లా కలెక్టర్ వద్ద పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నియామకాల్లో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్రంలోని పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు శుక్రవారం కదంతొక్కారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేశారు. అధికారులకు వినతి పత్రం అందజేశారు. పలు జిల్లాల్లో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

విజయనగరం కలెక్టరేట్‌ను గ్రీన్ అంబాసిడర్లు ముట్టడించారు. గేటు వద్ద బైఠాయించి ఎవరినీ లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. 18 నెలలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లి అధికారులకు తమ బాధను చెప్పుకునేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు బలవంతంగా అరెస్టులకు పాల్పడ్డారు. సిఐటియు నేతలను బలవంతంగా అరెస్టు చేసే క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ, మద్దిల రమణను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీసు వ్యానులో ఎక్కించి అరెస్టు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ వద్ద ఆందోళనను కొనసాగించారు. దీంతో దిగొచ్చిన కలెక్టర్ నాగలక్ష్మి కార్మిక సంఘం నేతలను లోనికి ఆహ్వానించారు. ఆరుగురు సభ్యులతో సిఐటియు నేతలు కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఈ నెల 15వ తేదీలోగా కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నాచౌక్‌లో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు, కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో యునియన్ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్ పాల్గొని మాట్లాడారు. వేతనాలు విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, టెండర్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరి సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న చలో విజయవాడ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతపురంలో సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మూకటిలో గడ్డివేసుకుని, జీతాలు రాకపోతే గడ్డి తినాలా అంటూ నినాదాలు చేశారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ధర్నా అనంతరం కార్యాలయంలోకి కార్మికులు చొచ్చుకెళ్లేదుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు కార్మికులు, సిఐటియు నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. గుంటూరు, తిరుపతి, ఏలూరు, పశ్చిమగోదావరి, అనకాపల్లి, బాపట్ల, శ్రీకాకుళం కలెక్టరేట్ల వద్ద కార్మికులు ధర్నా చేసి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

పేదలు, దళితుల పట్ల నిరంకుశ వైఖరి తగదు

- ఎపి వ్యకాస ఆధ్వర్యాన పాదయాత్ర ప్రారంభం



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి- టి.నరసాపురం (ఏలూరు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి విమర్శించారు. ఎర్ర కాలువ మిగులు భూముల్లో పేదలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, ఈ ప్రాంతంలోని అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన పాదయాత్రను ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెంలో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూపంపిణీ చేస్తామని ప్రకటించి అసైన్డ్ భూముల చట్ట సవరణ చేయడం దుర్మార్గమన్నారు. 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వకపోగా ఈ చట్ట సవరణ ద్వారా 20 ఏళ్లు ఎవరైతే ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో వారికే పట్టాలిస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. ఎర్రకాల్వ మిగులు భూముల పట్ల చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజా, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు స్పందించి పేదలకు, దళితులకు, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ హాజింగ్‌పై కేసును ఉపసంహరించుకోవాలి

- విద్యారంగ ప్రముఖుల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రొఫెసర్ హాజింగ్‌పై కక్షపూరితంగా బనాయించిన కేసును ఉపసంహరించుకోవాలని రాష్ట్రంలోని వివిధ రంగాల విద్యారంగ ప్రముఖులు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం వారు సమావేశమయ్యారు. మణిపూర్‌లో నెలకొన్న హింసాకాండపై వ్యతిరేకంగా హాజింగ్ మాట్లాడారని నమోదు చేసిన కేసుపై ఇంఫాల్ ఈస్ట్ జిల్లా కోర్టు హాజింగ్‌కు సమన్లు జారీచేసిందని వక్తలు పేర్కొన్నారు. దీనిని తప్పుపడుతూ దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన 32 మంది విద్యావేత్తల బృందం సంయుక్త ప్రకటన విడుదల చేసిందన్నారు. ఇప్పటికైనా మణిపూర్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎపి విద్యా పరిరక్షణ బాధ్యులు రమేష్ పట్నాయక్, మాజీ ఎంపి పి మధు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, మాజీ అధ్యక్షులు సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి, విద్యావేత్త గుంటుపల్లి శ్రీనివాస్, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి రామరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ వదలం

- నాపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవి : లోకేష్


మంగళగిరి కోర్టు ప్రాంగణంలో నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

తనపై తప్పుడు ఆరోపణలు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హెచ్చరించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కి నిధులు మంజూరు చేయించి స్కామ్‌కి పాల్పడ్డారని తనపై నిరాధార ఆరోపణలు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్ రెడ్డిపైనా, స్కిల్ స్కామ్‌పై ఇడి కొరడా అంటూ అభూత కల్పనలతో కథనం రాసి, తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించిన సాక్షి దినపత్రికపైనా గుంటూరు జిల్లా మంగళగిరి అడిషినల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేసిన క్రిమినల్ కేసులకు సంబంధించి న్యాయమూర్తి ఎదుట శుక్రవారం వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మంగళగిరి టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తనపై బురదజల్లి వెళ్లిపోతానంటే ఊరుకునేది లేదని, నిరాధార ఆరోపణలు చేసే వారందరిపై న్యాయపోరాటం చేస్తానని లోకేష్ ప్రకటించారు. తాను తప్పులు చేయనని, తప్పుడు ప్రచారం చేసే ఎవ్వరినీ వదిలిపెట్టనని హెచ్చరించారు. అందుకే వరసగా తప్పుడు ఆరోపణలు చేసిన, కట్టుకథలు రాసిన వారందరిపైనా పరువునష్టం దావాలు వేస్తున్నానని తెలిపారు. ఇప్పటి వరకు సివిల్, క్రిమినల్ కలిపి ఎనిమిది కేసులు వేశామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి మరీ టిడిపి కేడర్‌ని ఇబ్బంది పెడుతున్న అధికారులు, మీడియా సంస్థలపైనా న్యాయపోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్రలో సాక్ష్యాలు, ఆధారాలతో వైసిపి నేతలు, ఎమ్మెల్యేల బండారం బయటపెడతానని అన్నారు. రాజధాని అమరావతిలో లిటిగేషన్‌లో ఉన్న భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మేం అధికారంలోకి వస్తే అన్ని రకాల మౌలిక వసతులతో పేదలకు ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పి.అనురాధ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'పోలవరం' బ్యాక్ వాటర్ వల్లే మునక

- సాధారణ వరదగా భావించవద్దు
- 4 మండలాల్లో గ్రామాల ముంపుపై ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భద్రాచలం వద్ద గోదావరి వరద 35 అడుగులు ఉన్న సమయంలోనే గ్రామాల్లోకి నీళ్లు ప్రవేశించడానికి పోలవరం రిజర్వాయర్ బ్యాక్ వాటరే కారణమనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్ పురం మండలాల్లో ఇటీవల వచ్చిన వరద ప్రాంతాల్లో తనతోపాటు సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తదితరులు పర్యటించినట్లు లేఖలో

తెలిపారు. ముఖ్యమంత్రి కూనవరం వస్తున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయని, అయితే ఆ పర్యటన వాయిదా పడిందని తెలిసిందని పేర్కొన్నారు. ఆ ప్రాంతానికి వెళ్లడానికి ముందే అక్కడి విషయాలను లేఖ ద్వారా సిఎం దృష్టికి తీసుకురాదలచినట్లు వివరించారు. భద్రాచలం వద్ద గోదావరి వరద 35 అడుగులు ఉన్నప్పుడే గ్రామాల్లోకి నీరు ప్రవేశిస్తున్నందున వీటిని సాధారణ వరద ముంపుగా భావించడం సరైనది కాదని తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 41.15 కాంటూరు లోపే అనేక గ్రామాలు మునిగి పోతున్నందున వాటికి మొదటి దశలోనే పునరావాసం కల్పించాలని కోరారు. సాధారణంగా గోదావరికి నాలుగు ఐదు ఏళ్లకు ఒకసారి వరదలొస్తాయని, కానీ ప్రస్తుతం వరుసగా వరదలొస్తున్నాయని తెలిపారు. గత సంవత్సరం వరదలు మరవక ముందే మరలా ఈ సంవత్సరం వచ్చాయని పేర్కొన్నారు. గత సంవత్సరమంత తీవ్రత లేనప్పటికీ ప్రజలను ప్రస్తుత వరదలు కూడా భయ భ్రాంతులకు గురి చేశాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గ్రామాల్లోకి రావడమే ఈ పరిస్థితికి కారణమని వివరించారు. ఇలా చెప్పడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపారు.. ఎటపాక మండలం వీరాయిగూడెం గ్రామాన్ని సందర్శించిన సమయంలో గోదావరి వరదల్లో భద్రాచలం వద్ద 42 అడుగుల వరకు వచ్చిన తర్వాత మాత్రమే తమ గ్రామానికి వరద వస్తుందని స్థానికులు చెప్పారని, అయితే, గత సంవత్సరం జూలైలో వచ్చిన వరదలకు గ్రామం పూర్తిగా మునిగిపోయిందని తెలిపారు. ఇప్పుడు వచ్చిన వరదల్లో కూడా చుట్టూ నీళ్లు వచ్చి గ్రామాన్ని దిగ్బంధనంలో ముంచిందని సిఎం దృష్టికి తీసుకువచ్చారు. భద్రాచలం వద్ద 35 అడుగులకు చేరుకోవడానికి ముందే ఈ గ్రామంలోకి నీళ్లొచ్చాయని పేర్కొన్నారు. కేవలం పోలవరం బ్యాక్ వాటర్ రావడం వల్ల మాత్రమే ఈ పరిస్తితి ఏర్పడిందని తెలిపారు. ఆ గ్రామస్తులకు రెండు వారాలుగా ఎలాంటి సహాయ సహకారాలు అందలేదని పేర్కొన్నారు. బయటకు వచ్చి ఏదైనా వస్తువులు కొనుక్కొని వెళ్లడానికి, తిండి గింజలు తీసుకోవడానికి అవసరమైన పడవలూ ఇవ్వలేదని తెలిపారు. 10 - 12 అడుగులు లోతున నీళ్లు ఊరు చుట్టూ చేరినందున బయటకు రాగలిగే స్థితి లేదని, 12 రోజుల తర్వాత కలెక్టరుకు విన్నవించుకున్నాక బోటు ఒకటి పంపించారని పేర్కొన్నారు. ఆ బోటు వచ్చేటప్పటికి నీళ్లు తగ్గడం మొదలైందని తెలిపారు. 12 రోజుల పాటు వారికి ఎలాంటి సహాయం అందలేదని,

ఇప్పటికీ నిత్యావసరాలు ఇవ్వలేదని వివరించారు.

ఎటపాక గ్రామంలో సైతం దళితులు అత్యధికంగా నివసించే లోతట్టు ప్రాంతాలు చుట్టూ నీళ్లు వచ్చినప్పటికీ వారికి నిత్యావసర సరుకులు అందించలేదని తెలిపారు. గత సంవత్సరం కూడా వరదల్లో ఈ ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయని తెలిపారు. అప్పట్లో గ్రామ వాలంటీర్లు ప్రజల సామాన్లు ఎత్తయిన ప్రాంతాలకు తరలించారు తప్ప ఇతర సహాయచర్యలు అందివ్వలేదని తెలిపారు. పైన వర్షం.. కింద వరద ఈ పరిస్థితుల్లో వారెలా బతికారో అర్థం చేసుకోవాలని కోరారు.

కూనవరం గ్రామానికి కూడా ఈసారి వరదలొచ్చాయని, గత సంవత్సరం వచ్చిన వరదల కన్నా తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ ఈ మండలంలో 45 కాంటూరులో ఉండేటువంటి అనేక గ్రామాలు 32వ కాంటూరు లోనే మునిగి పోయాయని తెలిపారు. గ్రామంలోకి నీరు రాకపోయినా, చుట్టూ నీరు చేరినటువంటి గ్రామాలను కూడా మునక గ్రామం కిందే గుర్తించాలని కోరారు. శబరి పొంగి చింతూరు గ్రామాన్ని ముంచి వేసిందని, పది రోజులపాటు శబరికి అటూ ఇటూ ఉన్న కాలనీల్లో ప్రజలు హైస్కూల్లో ఆశ్రయం పొందారని పేర్కొన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం లోనూ, అక్కడ కనీస అవసరాలు తీర్చడం లోనూ ప్రభుత్వ యంత్రాంగం శ్రద్ధ పెట్టలేదని, కూనవరం, వి ఆర్ పురం గ్రామాల్లో గుట్టల మీదకు చేరిన వారికి ఎలాంటి సౌకర్యాలూ కల్పించలేదని పేర్కొన్నారు.

శిబిరాల నుండి తిరిగి వెళ్లే వారికి ప్రభుత్వం ప్రకటించినట్లుగా రెండు వేల రూపాయలు ఇవ్వలేదని అదేసమయంలో సిఎం వస్తున్నారని కూనవరంలో హడావుడి చేస్తున్నారని వివరించారు. ఇప్పటికీ అనేక మంది రోడ్ల మీదే నివాసం వున్నారని, ముందస్తు సహాయక చర్యల కోసం జూన్ 29వ తేదీనే ఉత్తరం రాశానని, అయినా బాధితులను గాలికి వదిలేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మునిగిన లేదా చుట్టూ నీరు చేరిన గ్రామాల ప్రజలందరికీ ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి కుటుంబానికి పది వేల రూపాయల సహాయం అందించాలని కోరారు.

వరద బాధిత ప్రాంతంలో ప్రకటించిన ప్రభుత్వ సహాయం సత్వరమే అధికార యంత్రాంగం ద్వారా అమలు చేయించాలని కోరారు. మొత్తం అన్ని మునక మండలాల్లో వర్గీకరణ చేయకుండా వరద సహాయం ప్రతీ గ్రామానికి, ప్రతి కుటుంబానికి ఇస్తామని చెప్పినట్లు ఈ రోజు కూడా మీడియాలో వచ్చిందని దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. 'తేడాలు లేకుండా వరద ప్రాంత గ్రామాలన్నింటికీ మీరు ప్రకటించిన నిత్యావసరాలను సత్వరమే అందించండి' అని సిఎంకు విజ్ఞప్తి చేశారు. అన్ని మండలాల్లోను వరద నష్టాన్ని వెంటనే ఎన్యూమరేషన్ చేయించాలని, ఖచ్చితంగా ఆస్తి నష్టం అంచనా వేయాలని, నష్టపరిహారం, తక్షణ వైద్య సహాయం, శిబిరాలు నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో ఇప్పటివరకు బ్లీచింగ్ కూడా చేయలేదని, రోడ్ల మరమ్మతులు చేసి రాకపోకలు యధాస్థితికి తీసుకురావాలని కోరారు. వరదలొచ్చినా ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కూనవరం సందర్శించినపుడు నేరుగా ఆ గ్రామానికి వచ్చి పోవడం కాకుండా భూ మార్గాన గ్రామస్తులను కలిసి క్షేత్రస్థాయి రిపోర్టుల ఆధారంగా వాస్తవాలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బెయిల్ దరఖాస్తుకు శివశంకర్ రెడ్డికి అనుమతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో ఎ-5 నిందితుడిగా ఉన్న శివశంకర్ రెడ్డి బెయిల్ దరఖాస్తుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది. కేసులో ట్రయల్ ప్రారంభంతో సంబంధం లేకుండా బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. మార్చి 29న సుప్రీం ఉత్తర్వులపై స్పష్టత ఇవ్వాలని శివశంకర్ భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

సంపాదకీయం


డాలర్‌తో ముప్పు !

ఆర్థిక పరపతిని నిర్ధారించే కొలమానాల్లో రుణ యోగ్యత ముఖ్య ప్రామాణికం. దేశాలకైనా, వ్యక్తులకైనా 'నీ రుణ యోగ్యత ఇంతే'నంటూ తేల్చిపారేసే రోజులివి. 'సిబిల్‌' స్కోరు ఎంత ఉంటే రుణాలు పొందే యోగ్యత అంతవున్నట్టు! ఈ స్కోరు ఎంత దిగజారితే ఆర్థికంగా అంత దిగజారినట్టు. అంత కష్టాల్లో ఉన్నట్లు లెక్క. అమెరికాలోనూ, డాలర్‌ ప్రాపకానికి గురై దాంతో ముడిపడిన దేశాల్లోనూ ఇప్పుడు ఈ రుణ యోగ్యత రేటింగ్‌లే కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రేటింగ్‌ ఎజెన్సీ ఫిచ్‌ ఇటీవల అమెరికా రుణ యోగ్యతకు కోత విధించడం ఆ దేశ ఆర్థిక దుస్థితికి అద్దం పట్టింది. ఇదివరకు 'ఎఎఎ'గా ఉన్న రేటింగ్‌ను 'ఎఎ ప్లస్‌'కు తగ్గించింది. పరపతికి కోత పెట్టడంతో పాటుగా రానున్న మూడేళ్లలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించొచ్చని హెచ్చరించింది కూడా. యుఎస్‌పై పెరుగుతున్న రుణ భారమే ఇందుకు ప్రధాన కారణంగా ఆ సంస్థ విశ్లేషించింది. ఆధిపత్య బరితెగింపుతో దేశాల మధ్య విద్వేషాగ్ని రాజేయడం, సైనిక జోక్యం, మింగుడు పడని దేశాలపై ఆంక్షలు విధించడం ఆది నుంచి అమెరికా చేస్తూ వచ్చిన కుతంత్రాలు అన్నీఇన్నీ కావు. అన్ని దేశాలనూ వ్యతిరేకంగా చేసుకుంటూ రావడం వల్లే ఆంక్షలు విధించాల్సిన దేశాల జాబితా పెరిగిపోయి లావాదేవీలు కుంగిపోయి ఇప్పుడు తాను తీసుకున్న గోతిలో తానే పడ్డట్టుగా ఆర్థిక మాంద్యంలోకి దిగజారుతోంది.

సైనిక వ్యయాన్ని పెంచుకుపోతుండటం, కార్పొరేట్‌ కంపెనీలకు ప్రజాధనాన్ని తరలించడం, బ్యాంకులను దివాళా దీయించడం వంటి చర్యలతో ఆర్థిక క్రమశిక్షణను, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి. ఉక్రెయిన్‌ను సాకుగా చూపి రష్యాపైనా, తైవాన్‌ను ఎగదోస్తూ చైనాపైనా 'పెట్టుబడి' అగ్రరాజ్యం విధించిన ఆంక్షలకు హద్దుపద్దు లేకుండా పోయింది. వస్తు, మేధో ఉత్పాదక శక్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిన చైనా ఇందుకు భిన్నంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నిటినీ వస్తు ఎగుమతుల ద్వారా ప్రభావితం చేస్తోంది. అమెరికా సబ్‌ప్రైమ్‌ రుణాల ఊబిలో చిక్కుకుపోవడం మూలాన 2008లో ఇప్పటికే మహామాంద్యమాన్ని చవిచూసిన ప్రపంచం ఇప్పుడు మళ్లీ అదే కలవరపాటుకు గురి అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

అమెరికా రుణ పరపతి తగ్గిపోవడంతో ఆ ప్రభావం అమెరికాతో అంటకాగుతున్న భారత్‌పై కూడా తీవ్రంగానే పడనుందని సెన్సెక్స్‌, నిఫ్టీ సూచీల వరుస పతనాలు సంకేతాలిస్తున్నాయి. బుధవారం ఒక్కరోజే మార్కెట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.3.5 లక్షల కోట్లు ఆవిరయ్యింది. యూరప్‌, ఆసియా మార్కెట్ల పరిస్థితి కూడా ఇంతే. పదేపదే సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకున్న అమెరికా డాలరు ప్రాపకం కూడా క్రమంగా దిగజారుతూ వస్తోంది. ప్రత్యామ్నాయ మారకాలకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంపన్న పశ్చిమ దేశాలకు ముడిపదార్థాలను సరఫరా చేసే మూడో ప్రపంచ దేశాలను డాలరు ఆధిపత్యంతో కీలుబొమ్మలుగా చేసుకోవచ్చునే ఎత్తుగడతో అమెరికా జిత్తులు వేస్తూవస్తోన్న సంగతి తెలిసిందే. ముడిసరుకుల ధరలను పెరగకుండా అదుపులో ఉంచడానికి, మూడో ప్రపంచ దేశాల ఆదాయాలలో పెరుగుదల లేకుండా చేయడానికి డాలర్‌ ఆధిపత్యం తోడ్పడుతుంది. అందువల్లే రష్యా, చైనా, అరబ్‌ ఎమిరేట్స్‌ వంటి దేశాలు ప్రత్యామ్నాయ మారకాల వైపు చూస్తున్నాయి. భారత్‌ కూడా ఈ సంక్షోభాల నుంచి పాఠాలు నేర్వాలి. గతంలో సోవియట్‌ యూనియన్‌ ఏవిధంగా రూబుల్‌కు, ఆయా దేశాల కరెన్సీలకు మధ్య నిర్ధారిత మారకపు రేటుతో ఒప్పందానికి వచ్చి వ్యాపార లావాదేవీలను జరిపేవారో, అదే మాదిరిగా ఇప్పుడు వివిధ దేశాలు ప్రత్యామ్నాయ మారకాలతో ముందుకొస్తున్నాయి. బ్రెజిల్‌, రష్యా, ఇండియా, చైనా, సౌత్‌ ఆఫ్రికా దేశాల కూటమిగా ఉన్న 'బ్రిక్స్‌' కూడా డాలరుతో ఢీ అంటోంది. 2022 నుండి 2026 మధ్య సభ్యదేశాలకు మంజూరయ్యే రుణాల్లో 30 శాతం ఆయా దేశాల కరెన్సీల రూపంలోనే ఇవ్వనున్నట్లు బ్రిక్స్‌ ప్రకటించింది కూడా. ప్రత్యామ్నాయ మారకాలు ఎన్ని వస్తే డాలరు పెత్తనం అంతగా తగ్గుతుంది. అమెరికా ఏకచక్రాధిపత్యానికి తెరపడి సంక్షోభాలు తగ్గుముఖం పడతాయి. వివిధ దేశాలు ప్రత్యామ్నాయం దిశగా అడుగులు వేస్తాయని ఆశిద్దాం.

మహనీయుల మాట



నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ... అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే! అదే ప్రజాస్వామ్యం.

- అబ్రహం లింకన్

Abraham Lincoln

తదుపరి లక్ష్యం జ్ఞానవాపి మసీదు !

వ్యాఖ్య

ఆలయం-మసీదు విషయంలో కొత్త ఫ్రంట్‌ ఏర్పడుతోందని ఉత్తరప్రదేశ్‌ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ పరోక్షంగా ప్రకటించారు. ఈసారి వివాదం జ్ఞానవాపి మసీదు, వారణాసి లోని విశ్వనాథ్‌ ఆలయం మధ్యన నెలకొంది. జ్ఞానవాపి మసీదు పూర్వం ఆలయమని నిర్ధారించడానికి మసీదు ఆవరణలో తగిన రుజువులు కూడా వున్నాయని ఆదిత్యనాథ్‌ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అందువల్ల ముస్లిం కమ్యూనిటీ ముందుకు వచ్చి గతంలో చారిత్రక తప్పిదం జరిగిందని, దీనికి పరిష్కారం కావాలని తాము కోరుకుంటున్నామని చెప్పాలని అన్నారు.

జ్ఞానవాపి మసీదు ఆవరణలో హిందువుల పూర్వాపరాలను నిర్ధారించడానికి చట్టబద్ధత పెరుగుతున్న నేపథ్యంలో ఆదిత్యనాథ్‌ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వారణాసి జిల్లా కోర్టు ఆదేశాల మేరకు, జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే నిర్వహించేందుకు భారత పురావస్తు విభాగాన్ని అనుమతిస్తూ ఆగస్టు 3వ తేదీన అలహాబాద్‌ హైకోర్టు తీర్పు ఇచ్చింది. జిల్లా కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా మసీదు కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది.

2019లో అయోధ్య వివాదంలో సుప్రీం కోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి, జ్ఞానవాపి మసీదు ఆవరణ లోని హిందూ విగ్రహాల వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు హిందువులకు గల హక్కును నొక్కిచెబుతూ వారణాసి కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అంతేగాక మసీదులోని కొలనులో వున్న ఫౌంటెన్‌కు కార్బన్‌ డేటింగ్‌ నిర్ధారించేందుకు, వీడియోగ్రాఫ్‌ సర్వేలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ వచ్చారు. ముస్లింలు ప్రార్థనలు చేయడానికి ముందు ఈ కొలనులో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకుంటారు.

'ఆరాధనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం - 1991' వున్నప్పటికీ న్యాయపరమైన ప్రక్రియలన్నీ జరుగుతూనే వున్నాయి. పార్లమెంట్‌ రూపొందించిన ఈ చట్టం 1947 ఆగస్టు 15 నాటికి వున్న ఆరాధనా స్థలాలు (ఆలయాలు, మసీదులు, చర్చిలను భిన్న మతానికి చెందిన ఆరాధనా స్థలాలుగా) మార్చడాన్ని నిషేధిస్తోంది. అంటే, స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఆరాధనా స్థలాలకు సంబంధించి యథాతథ స్థితికి ఈ చట్టం హామీ కల్పిస్తోందని అర్థం. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అటువంటి మార్పిడికి సంబంధించి కోర్టు కార్యకలాపాలు తగ్గుతాయి. అయితే అయోధ్య వివాదం, అందుకు సంబంధించి సాగిన కోర్టు కార్యకలాపాలు దీనికి ఏకైక మినహాయింపుగా వుంది. రామజన్మభూమి ఆలయం పేరుతో చేపట్టిన ఉద్యమం మాదిరిగా...ఆరాధనా స్థలాలను మార్చేందుకు ఎలాంటి ఆందోళనలు, మతోన్మాద కార్యకలాపాలు జరగవని...పి.వి.నరసింహారావు ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన ఈ చట్టం హామీ కల్పించింది. రామజన్మభూమి ఆలయ ఉద్యమం దేశంలో పెద్ద ఎత్తున హింసకు దారి తీసింది.



2019లో అయోధ్య వివాదంలో సుప్రీం కోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి, జ్ఞానవాపి మసీదు ఆవరణ లోని హిందూ విగ్రహాల వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు హిందువులకు గల హక్కును నొక్కిచెబుతూ వారణాసి కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అంతేగాక మసీదులోని కొలనులో వున్న ఫౌంటెన్‌కు కార్బన్‌ డేటింగ్‌ నిర్ధారించేందుకు, వీడియోగ్రాఫ్‌ సర్వేలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ వచ్చారు. ముస్లింలు ప్రార్థనలు చేయడానికి ముందు ఈ కొలనులో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకుంటారు. 'ఆరాధనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం -1991' వున్నప్పటికీ న్యాయపరమైన ప్రక్రియలన్నీ జరుగుతూనే వున్నాయి.

PEOPLE'S DEMOCRACY

అయోధ్య వివాదంలో తన తీర్పును వెలువరిస్తూ సుప్రీం కోర్టు, 1991 నాటి చట్టాన్ని లౌకిక దేశంగా అంతర్గత బాధ్యతలకు సంబంధించిన చట్టంగా సమర్థించింది. "వర్తమానాన్ని, భవిష్యత్తును అణచి వేసేందుకు సాధనాలుగా చరిత్రను, అందులోని తప్పులను ఉపయోగించరాదని పార్లమెంట్‌ ఎలాంటి సందేహం లేకుండా స్పష్టంగా పేర్కొంది" అని కూడా సుప్రీం కోర్టు తెలిపింది. 2019 లోనే సుప్రీం కోర్టు ఆరాధనా స్థలాల చట్టం-1991ని ఇంత గట్టిగా ధృవీకరించినప్పటికీ, తదనంతర కాలంలో వారణాసి కోర్టుల్లో జ్ఞానవాపి మసీదు ఆవరణపై తలెత్తిన వ్యాజ్యానికి స్వస్తి పలికేందుకు కోర్టు నిర్ణయాత్మకంగా ఎందుకు జోక్యం చేసుకోవడం లేదనేది ప్రశ్నార్థకంగా వుంది.

వారణాసి సివిల్‌ జడ్జి ఆదేశించిన విధంగా మసీదు ఆవరణ సర్వే, వీడియోగ్రఫీపై స్టే విధించాలని కోరుతూ మసీదు కమిటీ 2022 మేలో సుప్రీం కోర్టును ఆశ్రయించినపుడే ఉన్నత న్యాయస్థానానికి ఒక అవకాశం లభించింది. ఆరాధనా స్థలాల చట్టం ప్రాతిపదికన కోర్టు, ఈ జ్యుడీషియల్‌ కార్యకలాపాలకు ముగింపు పలికి వుండాల్సింది. కాని దానికి బదులుగా (ఐదుగురు మహిళలు వేసిన పిటిషన్‌ విచారణకు అర్హమైనదని పేర్కొనడాన్ని సవాలు చేస్తూ) మసీదు కమిటీ వేసిన పిటిషన్‌ను వారణాసి జిల్లా న్యాయమూర్తికి బదిలీ చేసింది. ఆయన సీనియర్‌ న్యాయమూర్తి అయినందున ఈ పిటిషన్‌ విచారణకు అర్హుడనే ప్రాతిపదికన ఈ బదిలీ జరిగింది.

ఎఎస్‌ఐ సర్వేకు సంబంధించి మసీదు కమిటీ తిరిగి జులైలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అప్పుడైనా అన్ని జ్యుడీషియల్‌ కార్యకలాపాలకు ముగింపు పలికి వుండాల్సింది.

అప్పటి నుండి, ఈ కేసులో మరిన్ని పిటిషన్లు దాఖల య్యాయి. జ్ఞానవాపి మసీదును తొలగించి, అక్కడ ఆలయాన్ని నిర్మించాలని కోరుతూ కూడా ఒక పిటిషన్‌ దాఖలైంది. ఇదంతా కూడా ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటరీ నియోజకవర్గంలో జరుగుతోందన్నది ఇక్కడ గమనించాల్సిన అంశం.

జ్యుడీషియల్‌ విభాగం ఉన్నత స్థాయిలో ప్రదర్శించిన ఈ పిరికితనం జ్ఞానవాపి మసీదు స్వభావాన్ని ప్రశ్నిస్తూ దిగువ కోర్టుల్లో అనేక చర్యలు తీసుకోవడానికి దారితీసింది. వీడియోగ్రఫీ సర్వే ద్వారా ఇప్పుడు ఎఎస్‌ఐ సర్వే ద్వారా వాస్తవాన్ని నిర్ధారించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించేందుకు కారణమైంది. ఈ క్రమంలో, మసీదు ఆవరణలో ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించాలంటూ మహిళలు వేసిన పిటిషన్‌ విచారణకు అర్హమైనదని జిల్లా కోర్టు సమర్థించింది. మసీదు ఆవరణలోని కొలనులో గల ఫౌంటెన్‌ రూపంలో శివలింగం వుందని వీడియోగ్రఫీ సర్వే వెల్లడించింది. ఇక తాజా తీర్పులో అలహాబాద్‌ హైకోర్టు మసీదు ఆవరణను ఎఎస్‌ఐ సర్వే చేయడానికి అనుమతించారు.


ఈద్గా-కృష్ణ జన్మభూమి వివాదానికి సంబంధించి మథుర కోర్టుల్లో ఇదే తరహాలో న్యాయ క్రమం నడుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో దిగువ న్యాయ వ్యవస్థ సహకరిస్తున్నట్లు కనిపిస్తున్నందున తమ ప్రయోజనాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చట్టబద్ధతను ఉపయోగించుకోవాలన్నది హిందూత్వ శక్తుల వ్యూహంగా కనిపిస్తోంది. న్యాయపరమైన అనుకూలతను సాధించిన తర్వాత, న్యాయ విరుద్ధమైన పద్ధతుల ద్వారా వాస్తవ పరిస్థితులను మార్చే ప్రయత్నాలు జరగవచ్చు.

మొగ్గ దశలో వుండగానే ఈ దుశ్చర్యను తుంచివేయడం, అయోధ్య తీర్పు సమయంలో విస్పష్టంగా తేల్చి చెప్పిన 1991 చట్టాన్ని వర్తింపచేయడం సుప్రీం కోర్టు చేయాల్సిన పని.

('పీపుల్స్‌ డెమోక్రసీ' సంపాదకీయం)

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు

నివాళి



నేడు ఏంగెల్స్‌ 128వ వర్ధంతి

యూరప్‌లో పరిశ్రమలు విస్తరించుతూ, కార్మికవర్గ దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్న 18వ శతాబ్దంలో ఒక బట్టల మిల్లు యజమాని కుటుంబంలో ఫ్రెడరిక్‌ ఏంగెల్స్‌ 1820 నవంబరు 28న ప్రష్యా (ఇప్పటి జర్మనీ) లోని బార్మెన్‌ నగరంలో జన్మించాడు. ఒక సామాజిక శాస్త్రవేత్తగా, రచయితగా, తత్వవేత్తగా, బహుభాషా కోవిదుడుగా, విప్లవకారుడిగా ఏంగెల్స్‌ జీవించాడు. ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంతమైన మార్క్సిజాన్ని రూపొందించడంలో మహా మహోపాధ్యాయుడు కారల్‌ మార్క్స్‌కు మిత్రుడుగా, చేదోడు వాదోడుగా జీవించాడు. ఒక పెట్టుబడిదారుని కుటుంబంలో పుట్టినా ఆ పెట్టుబడిదారీ వర్గ పెత్తనం సమాజానికి ఎంత కీడు చేస్తుందో అర్థంచేసుకుని ఆ వ్యవస్థ మార్పు కోసం జీవితాన్ని అంకితం చేసినవాడు ఏంగెల్స్‌.

ఏంగెల్స్‌కు చిన్నప్పటి నుండి పుస్తకాలు చదివే వ్యాపకం వుండేది. పదిహేడేళ్ల వయసులో అతని టేబుల్‌ సొరుగులో ఆఫ్రికాకు చెందిన 13వ శతాబ్దపు పోరాట వీరుని చరిత్ర పుస్తకాన్ని తండ్రి చూశాడు. అందుకు కలతచెంది ఏంగెల్స్‌ను చదువు మాన్పించి మాంచెస్టర్‌లోని తన బట్టల మిల్లుకు అప్రెంటిస్‌ శిక్షణ పేరుతో పంపించాడు. పెద్ద నౌకా కేంద్రమైన బ్రెమెన్‌ నగరంలోని వాణిజ్య సంస్థలో పని చేయడానికి ఏంగెల్స్‌ వెళ్లాడు. అక్కడ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో ఇంగ్లీషు, డచ్చి, ఫ్రెంచి తదితర భాషలలో పేపర్లు చదివేవాడు. జర్మనీలో ప్రభుత్వం నిషేధించిన సాహిత్యాన్ని చదివేవాడు. అలా ఏంగెల్స్‌ తన ప్రాపంచిక జ్ఞానాన్ని పెంచుకున్నాడు. 19వ ఏటనే ఏంగెల్స్‌ తన మిత్రులకు 15 భాషలలో లేఖలు రాసేవాడు. నిశిత పరిశీలన నేర్చుకున్నాడు. ఉప్పర్‌టాల్‌ అనే బట్టల మిల్లుల కేంద్ర నగరంలో బాలికలతో పనిచేయిస్తున్న పరిస్థితులను, అక్కడి ప్రజల ముఖ్యంగా కార్మికుల వెతలను పరిశీలించాడు. అక్కడి దీనగాథలు ఏంగెల్స్‌ను కదిలించి వేశాయి.

ఏంగెల్స్‌ 25 భాషలు మాట్లాడేవాడు. 15 భాషలలో ఉత్తరాలు, వ్యాసాలు రాసేవాడు. 1839 నుండి 42 మధ్యకాలంలో 50 వ్యాసాలను రాజకీయ, సాహిత్య, తత్వశాస్త్ర అంశాలలో రాయడం కోసం ఎంతో అధ్యయనం చేసాడు. ఇంగ్లండు లోని కార్మికుల స్థితిగతుల మీద పరిశీలన సాగించి "ఇంగ్లండులో కార్మికుల పరిస్థితి" అనే గ్రంథాన్ని రచించాడు (మార్క్స్‌తో పరిచయం కావడానికి ముందే రాసిన గ్రంథం). 'పవిత్ర కుటుంబం' పేరుతో కారల్‌ మార్క్స్‌తో కలసి రచించిన గ్రంథం 1846లో విడుదలైంది. వ్యక్తి ముందా? సమాజం ముందా? అనేదానికి సమాజమే ముందు అని రుజువులతో సహా ఆ గ్రంథంలో బోధించారు. మార్క్స్‌తో కలసి ఏంగెల్స్‌ సాగిస్తున్న కృషి, వారి తాత్విక దృష్టి, వారి పట్టుదల తెలిసిన కమ్యూనిస్టు లీగ్‌ 1847లో కమ్యూనిస్టు ప్రణాళికను రాసే పనిని మార్క్స్‌, ఏంగెల్స్‌లకు అప్పచెప్పగా అందుకోసం ఏంగెల్స్‌ విడిగా కమ్యూనిజం సూత్రాలు పేరుతో తన అభిప్రాయాలను మార్క్స్‌కు అందించాడు. 1848 ఫిబ్రవరి 21న విడుదల అయిన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో ఏంగెల్స్‌ ప్రతిపాదనలు చాలా భాగం ఉంటాయి.

'జర్మన్‌ సిద్ధాంత సంపుటి' గ్రంథాన్ని మార్క్స్‌తో కలసి రాశాడు. ఇందులో మానవుడి చైతన్యం-అస్తిత్వంలలో అస్తిత్వం యొక్క ప్రాధాన్యతను పొందుపరిచాడు. తత్వశాస్త్ర అభివృద్ధి శ్రామికవర్గానికి ఉన్న సంబంధం అవినాభావమైనదని, అవి ఒకదానితో ఒకటి కలసి అభివృద్ధి చెందుతాయని నిర్ధారించాడు. అప్పటికే తత్వశాస్త్రంలో మార్గదర్శకత్వం వహిస్తున్న హెగెల్‌ గతితర్కాన్ని బలపరిచినా హెగెల్‌ లోని భావవాదాన్ని ఖండిస్తూ 'దేవుడు మనిషిని సృష్టించలేదు-మనిషే దేవుడ్ని సృష్టించాడు' అని చెప్పి భౌతికవాదాన్ని సమున్నతంగా నిలిపాడు. వానరుడు నరుడుగా మారిన క్రమంలో శ్రమ పాత్ర రచనల ద్వారా శ్రమైక జీవన సౌందర్యం సాధించుకోవచ్చని, ఆ దిశగా మానవ ప్రయాణం తథ్యమనే విశ్వాసాన్ని ఈ రచన కల్పిస్తుంది.

నిరుద్యోగ సమస్య, కార్మికుల మీద ప్రభావాన్ని తెలిపే వేతన వ్యవస్థ గ్రంథంలో "పెట్టుబడిదారుడు కార్మికునితో అంగీకారానికి రాలేకపోతే ఆగిపోయి తన పెట్టుబడి మీద బతకగలడు. కాని కార్మికుడు అలా చేయలేదు. అతనికి బతకడానికి కూలి మాత్రమే ఉంది. కనుక అతను ఎప్పుడు, ఎక్కడ, ఏ షరతుల మీద పని సంపాదించుకోగలిగితే అప్పుడు, అక్కడ, ఆ షరతుల మీద పనిని తీసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం అయితేనే నిరుద్యోగం రద్దుకు అవకాశం ఏర్పడుతుందనే విషయం తేటతెల్లం చేశాడు. పెట్టుబడి గ్రంథ రచనలోను, మార్క్స్‌తో పాటు సిద్ధాంత కృషిలో భాగస్వామిగా ఎన్నో గ్రంథాలను, సాహిత్యాన్ని ఏంగెల్స్‌ అధ్యయనం చేసాడు.

ప్రపంచానికి మార్క్సిజాన్ని అందించడానికి మార్క్స్‌ చేసిన కృషిలో భాగస్వామిగాను, విడిగాను ఎన్నో రచనలు చేశాడు. భావ సారూప్యత కారణంగా వారిద్దరూ ఆఖరి వరకూ మిత్రులుగానే జీవించారు. కార్మికవర్గ విముక్తి, మానవ కళ్యాణం కోసం కలసి కృషి చేశారు. ఏంగెల్స్‌ తన జీవితాంతం మార్క్స్‌ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచాడు. మార్క్స్‌తో పాటు పెట్టుబడి రచనలో భాగస్వామి. మార్క్స్‌ మరణానంతరం పెట్టుబడి 2,3 భాగాలు ముద్రణకు కృషి చేశాడు. ఏంగెల్స్‌ 1895 ఆగష్టు 5వ తేదీన లండన్‌లో మరణించాడు.


- గుడిపాటి నరసింహారావు,
సెల్‌ : 9490098559

'ఇండియా' వర్సెస్‌ భారత్‌

విశ్లేషణ

భారతీయ జనతా పార్టీ గత తొమ్మిదేళ్ళుగా అధికారంలో ఉంటున్నది. ఈ పార్టీ రాజ్యాంగబద్ధంగా లేదా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా ఏర్పడే సమ్మిళిత భారతదేశం కోసం పాలన చేయడం లేదని ప్రతిపక్ష పార్టీలకు క్రమంగా అర్థమైంది. ప్రతిపక్ష పార్టీలను బలహీన పర్చేందుకు అధికార పార్టీ ఇ.డి, సిబిఐ లాంటి ఏజెన్సీలను ప్రధానమైన సాధనాలుగా ఉపయోగించుకుంటున్నది. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వ విధానాలు ఒకవైపు ఆశ్రిత పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తూ, మరోవైపు ప్రజాస్వామిక స్వేచ్ఛను బలహీనపరుస్తున్నాయి.

అస్తిత్వం, రామమందిరం, లవ్‌ జీహాద్‌, ఇతర జీహాద్‌ లు, ఆవు మాంసం, పొరుగు వారికి వ్యతిరేకంగా తీవ్ర జాతీయవాద విన్యాసాలకు సంబంధించిన అంశాలే కేంద్రంగా, అధికార పార్టీ రాజకీయాలు నడుస్తున్నాయి. పెద్దనోట్ల రద్దు, కోవిడ్‌-19 మహమ్మారి వ్యాపించినప్పుడు కేవలం కొద్ది సమయం ముందు ప్రకటించి దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌, పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల సమస్యలు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీ మతస్థులకు వ్యతిరేకంగా పెరుగుతున్న దారుణమైన అకృత్యాల వంటి అనేక సమస్యల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలు సమాజంలోని సగటు జీవుల, పేద ప్రజల కడగండ్లను మరింతగా పెంచాయి.



రామ్‌ పునియానీ

ఎన్నికల బాండ్లతో లెక్కలేనంత డబ్బును కూడబెట్టడం ద్వారా అత్యంత ధనిక జాతీయ పార్టీగా తయారైన బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం సెంట్రల్‌ ఏజెన్సీలను ఉపయోగించుకోసాగింది. మన వ్యవస్థను అస్థిరపరచి, సమస్యలకు కారణమైన మరొక యంత్రాంగం 'పి.ఎం కేర్‌ ఫండ్‌'. అన్నిటికంటే అత్యంత దారుణమైన విషయం ఏమంటే, బిజెపికి ఎన్నికల సమయంలో ఎలాంటి వైఫల్యాలు లేకుండా గట్టిగా పని చేసే రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ (ఆర్‌.ఎస్‌.ఎస్‌) అనుబంధ సంస్థలకు చెందిన కార్యకర్తలు బిజెపికి వెన్నుదన్నుగా ఉంటున్నారు. ఈ విధమైన అంశాలే, బిజెపి యేతర పార్టీలను ఐక్యం చేసి, ఇండియన్‌ నేషనల్‌ డెవలప్‌మెంట్‌ ఇంక్లూజివ్‌ అలయెన్స్‌ (ఇండియా)ను ఏర్పరచే పరిస్థితులు కల్పించాయి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి, బూత్‌ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తన కోసం పనిచేసే యంత్రాంగం ఉన్న బిజెపిపై పోరాడటానికి ... 26 ప్రతిపక్ష పార్టీలు బెంగళూరులో జరుపుకున్న మలి సమావేశంలో ఈ 'ఇండియా' ను రూపొందించడం జరిగింది.

ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్క తాటిపైకి రావడంతో బిజెపి మేల్కొని చేసిన మొదటి పని ఏమంటే, ముప్పై ఎనిమిది (అందరికీ తెలిసిన, అందరికీ తెలియని) చిన్నాచితకా పార్టీలను బయటకు తీసుకొచ్చి ఒక్కచోటకి చేర్చడం. బ్యానర్‌ పైన కనిపించే ఒకేఒక్క నాయకుడు చెప్పిన విధంగా నడుచుకుంటామని 38 పార్టీల నాయకులు (తమకు ఇష్టం లేకపోయినా) తలవంచారు. ప్రతిపక్ష పార్టీలు ఏర్పాటుచేసుకున్న 'ఇండియా' పేరును చూసి బిజెపి వారు తీవ్రంగా కలత చెందారు. ప్రతిపక్ష పార్టీలను అప్రతిష్టపాలు చేయడంతోపాటు కొంతమంది నాయకులు అలాంటి పదాన్ని ఉపయోగించడం సరి కాదన్నారు. ఢిల్లీ లోని బరఖంబా పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.



ప్రతిపక్ష పార్టీలు ఏర్పరచుకున్న 'ఇండియా' పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేయడం అనేది నిస్సందేహంగా మన నాగరికత సమ్మిళిత విలువలను వ్యతిరేకించడమే. భారతీయ నాగరికత అభివృద్ధి ఫలితంగానే మన రాజ్యాంగం ఏర్పడిందనేది విస్మరించకూడదు. హిమంత శర్మకు ప్రీతిపాత్రమైన విభజన రాజకీయాలపై 'ఇండియా' విజయం సాధిస్తుందని ఆశిద్దాం.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ వివిధ స్థాయిల్లో 'ఇండియా'పై వ్యాఖ్యానించారు. "మన నాగరికతకు సంబంధించిన వైరుధ్యాలు ఇండియా, భారత్‌లపై ఆధారపడి ఉన్నాయి. బ్రిటీష్‌ వారు మన దేశానికి 'ఇండియా' అని పేరు పెట్టారు. వలసవాద వారసత్వం నుండి మనల్ని మనం విముక్తం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. మన పూర్వీకులు భారత్‌ కోసం పోరాటం చేశారు కాబట్టి మనం కూడా భారత్‌ కోసం కృషిని కొనసాగించాలి" అన్నారు.

హిమంత శర్మ వ్యాఖ్యలకు స్పందిస్తూ, కాంగ్రెస్‌ నేత జైరాం రమేష్‌ ఇలా ట్వీట్‌ చేశారు: "ఆయన(శర్మ) కొత్త మెంటర్‌ మోడీ మనకు స్కిల్‌ ఇండియా (నైపుణ్య భారత్‌), స్టార్టప్‌ ఇండియా, డిజిటల్‌ ఇండియా లాంటి కొత్త పేర్లను పథకాలకు పెట్టారు. ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను 'టీమ్‌ ఇండియా'లా కలిసి పని చేయాలని కోరారు. ఆఖరికి ఆయన ఇండియాకు ఓటు వేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. కానీ 26 ప్రతిపక్ష పార్టీల వారు రూపొందించిన కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టినందుకు ఆయనకు కోపం వచ్చి ఇండియా పదాన్ని ఉపయోగించిన తీరు వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందన్నారు".

దీనితో ఖంగుతిన్న హిమంత తన ట్విట్టర్‌ ఖాతాలో 'ఇండియా కోసం బిజెపి'ని, 'భారత్‌ కోసం బిజెపి'గా మార్చారు.

భారతీయ నాగరికత గురించి బిజెపి కి చాలా సంకుచితమైన అవగాహన ఉంది. బిజెపి ఎప్పుడూ హిందూ మతం యొక్క బ్రాహ్మణవాద సాంప్రదాయాల గురించి విసుగు పుట్టించే విధంగా మాట్లాడుతుంది. గ్రీకులు, హన్‌ లతో జరిగిన సంపర్కాన్ని విస్మరించి, ఇస్లాం, క్రైస్తవం రాకను, మన నాగరికతపై 'విదేశీయులు' చేసిన దురాక్రమణగా ప్రచారం చేస్తున్నారు.

బ్రాహ్మణవాద విలువల ఆధారంగా పాలించబడిన గతానికి సంబంధించి... హిమంత శర్మ, అయన సంస్థల ప్రాపంచిక దృష్టి కోణం చాలా అసాధారణమైన రీతిలో ఉంటుంది. ఆఖరికి చార్వాకుడు, బుద్ధుడు, మహావీరుడు, అశోక చక్రవర్తి లాంటి వారు అందించిన గొప్ప భారతీయ సాంప్రదాయాలకు, భక్తి, సూఫీ సంప్రదాయాలు చేసిన తోడ్పాటుకు వారి దృష్టిలో అసలు స్థానమే లేదు. రొమిల్లా థాపర్‌, ఇర్ఫాన్‌ హబీబ్‌, రాంశరణ్‌ శర్మ, హర్బన్స్‌ ముఖియా లాంటి వామపక్ష చరిత్రకారుల పట్ల వారికి తీవ్ర ద్వేషభావం ఉంది. పుట్టుక ఆధారంగా ఏర్పడే కులం చుట్టూ తిరిగే వారి భారతీయ నాగరికత గురించి ఉండే దృష్టి కోణంలో చరిత్రకారుల పట్ల వారి ద్వేషభావం దాగి ఉంది. ఈ వృత్తిపరమైన చరిత్రకారులు సమాజం యొక్క లోతైన గతిశీలతను అత్యంత అద్భుతంగా వెలుగులోకి తీసుకొచ్చారు. వారు 'పాలకుల మతం' గురించి మాత్రమే కాక, దళితులు, మహిళలు, ఆదివాసీల జీవితాలను కూడా వివరించడం ద్వారా నిజమైన భారతీయ నాగరికత లోని భిన్నత్వాన్ని తెలియజేశారు. వలసవాదుల విశ్వాసాల ద్వారా చరిత్రను చూస్తున్న మితవాద స్రవంతి నేడు వలసవాద వారసత్వాన్ని కొనసాగిస్తున్నది. సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించడం వారి లక్ష్యం. కాబట్టే వారు రాజు యొక్క మతం ద్వారా చరిత్రను చూడడాన్ని ప్రవేశపెట్టారు.

వారు భారత రాజ్యాంగాన్ని ప్రధానమైన అడ్డంకిగా భావిస్తున్నారు. భారత జాతీయవాదం పెరగడం ప్రారంభమవడంతో వారు మనుస్మృతిని, దానిలోని చట్టాలను స్తుతించడం మొదలు పెట్టారు. వారి జాతీయవాదానికి ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు అంతర్గత ప్రమాదకారులనే ముద్ర వేశారు. ఇలాంటి రాజకీయాల ద్వారా, మరీ ముఖ్యంగా ఈ దేశానికి ఈ రాజ్యాంగం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పిన రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌ పూర్వ సర్సంగ్‌ చాలక్‌ కె.సుదర్శన్‌ ద్వారా భారత రాజ్యాంగం పట్ల ఉన్న తమ వ్యతిరేకతను చాలా స్పష్టంగా వ్యక్తీకరించారు.

ప్రతిపక్ష పార్టీలు ఏర్పరచుకున్న 'ఇండియా' పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేయడం అనేది నిస్సందేహంగా మన నాగరికత సమ్మిళిత విలువలను వ్యతిరేకించడమే. భారతీయ నాగరికత అభివృద్ధి ఫలితంగానే మన రాజ్యాంగం ఏర్పడిందనేది విస్మరించకూడదు. హిమంత శర్మకు ప్రీతిపాత్రమైన విభజన రాజకీయాలపై 'ఇండియా' విజయం సాధిస్తుందని ఆశిద్దాం.

(వ్యాసకర్త ఐఐటీ మాజీ ప్రొఫెసర్‌, సామాజిక కార్యకర్త)

దేశంలో పలు చోట్ల విద్వేష పొగ ఎగసిపడుతుంటే

కేరళ ఐక్యతకు ప్రతీకగా ఉంది : విజయన్




న్యూఢిల్లీ: దేశంలో పలు ప్రాంతాల్లో విద్వేష పొగ ఎగసిపడుతుంటే, కేరళ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఢిల్లీలో పునర్నిర్మించిన ట్రావెన్‌కోర్ ప్యాలెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని సాంస్కృతిక వైవిధ్యం తీవ్ర దాడికి గురవుతోందని, బహుళత్వాన్ని దెబ్బ తీసేందుకు ఎటువంటి దారుణాలకు పాల్పడుతున్నారో మణిపూర్‌లో చూస్తున్నామని అన్నారు. బహుళత్వం కేరళీయుల జీవితంలో భాగమని, అది ఇక్కడ ప్రతిబింబిస్తుందని అన్నారు. దేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై తీవ్ర దాడులు జరుగుతుండడం బాధ కలిగిస్తోందని అన్నారు. మణిపూర్‌లో ఎగసిపడుతున్న విద్వేషపు చిచ్చు, దేశంలోని ఇతర చోట్ల జరుగుతున్న ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం వీటిని రెచ్చగొడుతున్నారని ఆయన అన్నారు.

లాకప్‌డెత్‌ల్లో గుజరాత్ టాప్

న్యూఢిల్లీ: దేశంలో ఉన్న పోలీస్ స్టేషన్లలో మరణాలకు సంబంధించిన వివరాలను కేంద్ర హోంశాఖ విడుదల చేసింది. గత ఐదేళ్లకు చెందిన వివరాలను వెల్లడించింది. ఈ మరణాల్లో గుజరాత్ అగ్రస్థానంలో నిలిచింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ వివరాల మేరకు.. 2018 నుంచి 2023 మార్చి 31 వరకు నమోదైన వివరాలను కేంద్రం తెలిపింది. ఈ వివరాల ప్రకారం గత ఐదేళ్లల్లో గుజరాత్‌లో 81, మహారాష్ట్రలో 80, మధ్య ప్రదేశ్‌లో 50, బిహార్‌లో 47, ఉత్తరప్రదేశ్‌లో 41, పశ్చిమ బెంగాల్‌లో 40 మరణాలు సంభవించాయి. ఇక దక్షిణ రాష్ట్రాల విషాయానికొస్తే.. మొదటిస్థానంలో తమిళనాడు ఉంది. ఆ రాష్ట్రంలో 2018-19లో 11, 2019-20లో 12, 2020-21లో 2, 2021-22లో 4, 2022-23లో 7.. మొత్తం కలిపి ఇప్పటి వరకు 36 లాకప్ డెత్‌లు నమోదయ్యాయి.

పిల్లలు ఫోన్ వినియోగంపై చైనా మార్గదర్శకాలు !




బీజింగ్ : పిల్లలు స్మార్ట్ ఫోన్లను ఉపయోగించడంపై కాలపరిమితిని విధించాలని, వారు చూసే అంశాలను ఎంపిక చేసి అందించాలని చైనా భావిస్తోంది. ఇందుకు గానూ ఫోన్లలో 'మైనర్ మోడ్' సెట్టింగ్‌ను పెట్టడానికి, అలాగే యాప్‌లతో సింక్ అయ్యేలా సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని ముసాయిదా మార్గదర్శకాలను ప్రచురించింది. మూడేళ్ళ లోపు చిన్నారులకు, మూడు నుండి 8ఏళ్ళలోపు వారికి, 8-12, 12-18, 16-18 ఏళ్ళ వయస్సుల వారీగా మార్గదర్శకాలను రూపొందించింది.

ఇదిలా వుండగా ఈ వార్త వెలువడిన వెంటనే డిజిటల్ కంపెనీల షేర్లు పడిపోయాయి. ప్రతి గ్రూపునకు వారి వయస్సుకు సముచితంగా లేని సమాచారాన్ని ఫోన్లలో నిషేధించాల్సి వుంటుంది. ఆత్మహత్యలు, అశ్లీలత, అస్తవ్యస్థమైన ఆహారపు అలవాట్లు వంటి పలు అంశాలు ఈ నిషేధిత గ్రూపులో వుంటాయి. మూఢ నమ్మకాలను కూడా చేర్చే విషయాన్ని పరిశీ లించారు. అలాగే ఫోన్ల విని యోగంపై కాల పరిమితిని కూడా విధించారు. 8ఏళ్ళలోపు వారు కేవలం 40నిముషాలు మాత్రమే ఫోన్‌చూడాలి. 16-18 ఏళ్ళ వారు కేవలం రెండు గంటలు మాత్రమే ఆన్‌లైన్‌లో వుండాలి. అలాగే రాత్రి 10గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు స్మార్ట్ ఫోన్లలో సేవలు నిలిపివేయాలని భావిస్తున్నారు. అయితే ఫోన్ కాల్స్ వంటి నిర్దిష్ట సేవలు కొనసాగుతాయి. యువతలో ఇంటర్‌నెట్ పట్ల వ్యామోహాన్ని తగ్గించేందుకు గతంలో కొన్ని చర్యలు తీసుకున్నామని, అవి సానుకూల ప్రభావాన్ని చూపాయని సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది. కాగా వీటిపై ప్రతిస్పందించేందుకు ప్రజలకు సెప్టెంబరు 2 వరకు గడువు ఇచ్చారు.

లోక్‌సభలో రెండు బిల్లులు ఆమోదం

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన చేయాలని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తమ ఆందోళనను శుక్రవారం కూడా కొనసాగించాయి. దీంతో ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. తొలుత రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. మణిపూర్‌పై రూల్ 267 కింద చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టగా, రాజస్థాన్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై రూల్ 176 కింద చర్చ జరగాలని కేంద్ర మంత్రి, సభా నాయకుడు పియూష్ గోయల్ డిమాండ్ చేశారు. దీనికి ట్రెజరీ బెంచ్‌లోని ఎంపిలు మద్దతు ఇచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభను సోమవారానికి వాయిదా వేశారు. మరోవైపు లోక్‌సభ సమావేశం ప్రారంభం నుంచే ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు ప్రవేశపెట్టారు. అనంతరం ఇంటర్-సర్వీసెస్ ఆర్గనైజేషన్స్ (కమాండ్, కంట్రోల్ అండ్ డిసిప్లిన్) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు. వెంటనే సభ మధ్యాహ్నం 12:50 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారు. ప్రత్యేక హోదాను అమలు చేస్తూ రాష్ట్ర పునర్విభజన సవరణ ప్రైవేట్ మెంబర్ బిల్లును వైసిపి ఎంపి మార్గాని భరత్ ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు పర్మినెంట్ బెంచ్‌ను ఏర్పాటు (అంచనాల అమలు), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరణ ప్రైవేట్ మెంబర్ బిల్లులను టిడిపి ఎంపి కేశినేని నాని ప్రవేశపెట్టారు. బిజెపి తన లోక్‌సభ ఎంపిలకు 3 లైన్ విప్ జారీ చేసింది. ఆగస్టు 7 నుంచి 11 వరకు హాజరు కావాలని కోరింది. ప్రభుత్వ స్టాండ్, బిల్లులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

బిఆర్ఎస్ ధర్నా

మణిపూర్ సమస్య, ఢిల్లీ సర్వీసుల బిల్లుపై బిఆర్ఎస్ ఎంపిలు ధర్నా చేపట్టారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు ఇచ్చారు. లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించిన నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లుని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌పై చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

ఆప్ ఎంపి సస్పెండ్

లోక్‌సభలో ఆప్ ఎంపి సుశీల్ కుమార్ [illegible] రింకూను సస్పెండ్ చేశారు. కొత్తగా ఎన్నికైన ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సుశీల్ కుమార్ రింకూను లోక్‌సభ వర్షాకాల సమావేశాల మిగిలిన రోజులకు సస్పెండ్ చేశారు. ఇప్పటికే ఆప్ రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ సస్పెండ్‌కు గురయ్యారు.

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి కనీస వయస్సును తగ్గించాలి

పార్లమెంటరీ కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ : లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయస్సును తగ్గించాలని, దీంతో ప్రజాస్వామ్యంలో నిమగ్నమయ్యేందుకు సమాన అవకాశాలు కల్పించినట్లవుతుందని ఒక పార్లమెంటరీ ప్యానెల్ అభిప్రాయపడింది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీకి పోటీ చేయాలంటే కనీస వయస్సు 25 సంవత్సరాలు గానూ, రాజ్యసభ్య, రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు పోటీ చేయాలంటే కనీస వయస్సు 30 సంవత్సరాలు గానూ ఉంది. లోక్‌సభ, అసెంబ్లీకి పోటీని కనీస వయస్సును 25 నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని కమిటీ సిఫార్సు చేసింది. బిజెపి ఎంపి సుశీల్ మోడీ అధ్యక్షులుగా ఉన్న కమిటీ సిఫార్సు చేసింది. ఈ తగ్గింపు ప్రజాస్వామ్యంలో యువతకు సమాన అవకాశాలు కల్పించినట్లుఅవుతుందని తెలిపింది. కెనడా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జాతీయ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయస్సు 18 ఏళ్లుగానే ఉందని కమిటీ తెలిపింది. అలాగే రాజకీయాలకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యంతో యువతను సన్నద్ధం చేయడానికి సరైన విద్యా కార్యక్రమాలను అందించడానికి ఇసి, ప్రభుత్వాలు ప్రాధానత్య ఇవ్వాలని కమిటీ సూచించింది.

అండమాన్ ఎల్‌జికి జరిమానాపై సుప్రీం స్టే..

పోర్ట్‌బ్లెయిర్: అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌కు జరిమానా విధిస్తూ, ప్రధాన కార్యదర్శి కేశవ్ చంద్రను సస్పెండ్ చేస్తూ కలకత్తా హైకోర్టులోని పోర్ట్‌బ్లెయిర్ ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించిం ది. రోజువారీ కార్మికులకు ప్రయో జనాలను కల్పించాలని కోర్టు ఆదేశించింది. రోజువారీ కార్మికులకు కల్పించాల్సిన ప్రయోజనాలకు సంబంధించిన కోర్టు ఆదేశాలను పాటించ నందున అండమాన్ నికోబార్ దీవుల పాలకవ ర్గంపై పోర్ట్‌బ్లెయిర్ ధర్మాసనం గురు వారం తీవ్రంగా స్పందించింది.

నోర్మూసుకుని గమ్మున ఉండండి లేకుంటే మీ ఇంటికి ఇడి వస్తుంది

- ప్రతిపక్ష సభ్యులకు కేంద్ర మంత్రి బెదిరింపులు

న్యూఢిల్లీ : నోర్మూసుకుని గమ్మున ఉండండి.. లేదంటే మీ ఇంటికి ఇడి వస్తుందని పార్లమెంట్ సాక్షిగా ప్రతిపక్ష ఎంపీలపై కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి బెదిరింపులకు దిగారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం లోక్‌సభలో ఢిల్లీ సేవల బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ సమయంలో కేంద్ర విదేశాంగ, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి ప్రసంగిస్తుండగా ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. దీనిపై మంత్రి మీనాక్షి లేఖి జర్రున లేచి, 'మీరు గమ్మున ఉండండి. లేదంటే మీ ఇంటికి ఇడి వస్తుంది' అని బెదిరింపు ధోరణిలో అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు నూటికి నూరుపాళ్లు నిజమని మంత్రి వ్యాఖ్యలు రుజువు చేశాయని ఎన్‌సిపిఅధికార ప్రతినిధి క్లాడీ కాస్ట్రో తెలిపారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు అని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ విమర్శించారు.

అసమానతలను రూపుమాపండి

- యువతకు పోప్ పిలుపు

లిస్బన్ : ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ కులీన వ్యవస్థను, అసమానతలను తిరస్కరించాల్సిందిగా యువ కేథలిక్కులకు పోప్ ఫ్రాన్సిస్ పిలుపిచ్చారు. ప్రపంచ యువజన దినోత్సవం సందర్భంగా లిస్బన్ యూనివర్శిటీలో ఆయన యువతతో మాట్లాడారు. శరణార్థులతో ఎడారీకరణ విషాదాన్ని కలిపిచూడాలని, అలాగే తగ్గుతున్న జననాల రేటుతో పెరుగుతున్న వలసలను కలిపి చూడాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. వర్థమాన ప్రపంచం నుండి వచ్చిన మొదటి కేథలిక్ గురువైన పోప్ ఫ్రాన్సిస్ ఆధునిక పెట్టుబడిదారీ విధానాన్ని, పశ్చిమ దేశాల ప్రభుత్వాలను, ముఖ్యంగా శరణార్థులపై వారి వ్యవహార శైలిని విమర్శించారు.

మసీదు నిర్మాణాన్ని ధ్వంసం చేయొద్దు

- 'జ్ఞానవాపి' సర్వేపై సుప్రీం

న్యూఢిల్లీ: కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వేకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. అయితే, సర్వేను 'నాన్-ఇన్వేసివ్ టెక్నిక్'లో కొనసాగించాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించింది. అలాగే. మసీదు నిర్మాణాన్ని ధ్వంసం చేసేలా సర్వేలో ఎలాంటి పరికరాలను ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. శాస్త్రీయ సర్వేను ఆపాలన్న మసీదు కమిటీ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ మసీదులో వజూఖానా మినహా మిగతా ప్రాంగణమంతా సర్వే జరిపి.. హిందూ ఆలయం స్థానంలో ఈ కట్టడాన్ని నిర్మించారా? లేదా? అనే విషయాన్ని నిర్ధారించాలని వారణాసి జిల్లా ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును అలహాబాద్ హైకోర్టు కూడా సమర్థించింది. దీంతో ఏఎస్ఐ అధికారులు సర్వే కూడా ప్రారంభించారు. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. పురావస్తు శాఖ, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపించారు. సర్వే సమయంలో మసీదు ప్రాంగణంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టడం లేదని, నిర్మాణాలను ధ్వంసం చేయబోమని హామీ ఇచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

బాబు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

పుంగనూరులోకి ప్రవేశించి ముందుగానే తెచ్చుకున్న బీర్ బాటిల్స్, కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడి చేసిందన్నారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే పోలీసులపై దాడులు జరిగాయని, 50 మంది పోలీసులు గాయపడ్డారని, వారిలో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. రెండు పోలీసు వాహనాలను ధ్వంసం చేసి నిప్పు పెట్టారన్నారు. అల్లరి మూకలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన పోలీసులను ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

అన్నమయ్య జిల్లాలో ...

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లులో వైసిపి శ్రేణులు రెచ్చిపోయారు. ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరిలో భాగంగా అంగళ్లు నుంచి పుంగనూరుకు చంద్రబాబు వెళ్తుండగా, ఆయన కాన్వాయ్‌లోని వాహనాలపైనా, ప్రసంగిస్తున్న సమయంలోనూ రాళ్ల దాడి చేశాయి. టిడిపి వారుకట్టిన బ్యానర్లను వైసిపి కార్యకర్తలు చించేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన టిడిపి కార్యకర్తలపై రాళ్లతో దాడి చేశారు. టిడిపి వారు కూడా వైసిపి వారిపై రాళ్లు రువ్వారు , వైసిపి రాళ్ల దాడిలో మదనపల్లె మండలం కొత్తపల్లి ఎంపిటిసి సభ్యులు దేవేంద్ర పాటు మరో టిడిపి కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో 20కిపైగా కార్ల అద్దాలు ధ్వంసమైనట్టు సమాచారం. చంద్రబాబుకు వ్యతిరేకంగా తంబళ్లపల్లిలోనూ నల్ల జెండాలతో వైసిపి శ్రేణులు నిరసన తెలిపాయి.

మంత్రి పెద్దిరెడ్డి పతనం ప్రారంభమైంది : చంద్రబాబు

తన పర్యటనలో ప్రజల నుంచి వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక తన కార్యకర్తలు, నాయకులపై వైసిపి కార్యకర్తలతో దాడి చేయిస్తున్నారని, మంత్రి పెద్దిరెడ్డి పతనం ప్రారంభమైందని, ఈ రోజు నుంచి రోజులు లెక్కపెట్టుకోవాలని చంద్రబాబు హెచ్చరించారు. తన కాన్వాయ్‌పై దాడి చేయడం తాను ప్రసంగిస్తున్న సమయంలో రాళ్ల దాడి జరిగిందని, ఇది ఒక చీకటి రోజని, పోలీసులు ఎవరికి ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లరి మూకలను అదుపులోకి తేలేని పోలీసుల తప్పుకుంటే మా కార్యకర్తలే రంగంలోకి దిగుతారన్నారు. పెద్దిరెడ్డి రౌడీయిజాన్ని పాతాళానికి తొక్కేస్తానని అన్నారు.

రాహుల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నన్ను ఎవరూ ఆపలేరు : రాహుల్ గాంధీ

ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎలాంటి పరిణామాలు ఎదురైనా తనను ఎవరూ ఆపలేరని రాహుల్ గాంధీ అన్నారు. "ఏది జరిగినా నా కర్తవ్యం మాత్రం ఒకేలా ఉంటుంది. దేశం, ప్రజల ప్రయోజనాలను రక్షించడమే నా బాధ్యత" అని రాహుల్ పేర్కొన్నారు.

ఇదిలా వుండగా రాహుల్ గాంధీ ఎంపి సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి కోరారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. " వచ్చే వారం అవిశ్వాస తీర్మానంపై రాహుల్ మాట్లాడాలని తాము కోరుకుంటున్నామని చౌదరి తెలిపారు. కోర్టు నుంచి ఉత్తర్వులు రానీయండి, అప్పుడు చేయాల్సింది చేస్తామని స్పీకర్ పేర్కొన్నారని, ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి చిదంబరం కూడా స్పీకర్‌ను కోరారు. సుప్రీంకోర్టులో ఉపశమనం లభించడంతో కాంగ్రెస్ ట్విట్టర్ వేదికగా హర్షం వ్యక్తం చేసింది. "వస్తున్నా.. ప్రశ్నలు కొనసాగుతాయి" అంటూ రాహుల్ గాంధీ ఫొటోతో ఓ ట్వీట్ చేసింది.


సోమవారం నుంచి పార్లమెంటుకు?

రాహుల్ గాంధీ సోమవారం నుంచి పార్లమెంటుకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే సుప్రీంకోర్టు తాత్కాలిక ఆదేశాల నేపథ్యంలో రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తున్నట్లు, ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను తొలగిస్తున్నట్లు లోక్ సభ సచివాలయం ఓ ప్రకటనను జారీ చేయాల్సి ఉంటుంది. లక్ష ద్వీప్ ఎంపి మహమ్మద్ ఫైజల్‌కు ఓ క్రిమినల్ కేసులో పదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును కేరళ హైకోర్టు నిలిపేసింది. హైకోర్టు ఆదేశాలు వెలువడిన రెండు నెలల తరువాత ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్ సభ సచివాలయం ఆదేశాలు ఇచ్చింది. కాగా, మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంపై చర్చ మంగళవారం నుంచి ప్రారంభం కాబోతోంది. రాహుల్ గాంధీ సోమవారం నుంచి లోక్‌సభకు హాజరయ్యే అవకాశం ఉంది.

కాప్ 26 నిరసనల్లో అరెస్టయిన 'యంగ్ కమ్యూనిస్టు' నేత నిర్దోషి

గ్లాస్గో : స్కాట్లాండ్ నగరమైన గ్లాస్గోలో 2021లో ప్రపంచ వాతావరణ సదస్సు జరుగుతున్న సందర్భంగా ఆందోళనలు జరిపిన గ్లాస్గో యంగ్ కమ్యూనిస్టు లీగ్ (వైసిఎల్) కార్యదర్శి నాథన్ హెన్నెబ్రేను గ్లాస్గో షరీఫ్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆ సదస్సు జరుగుతున్న సమయంలో మొత్తంగా 50మందిని అరెస్టుచేశారు. వారిలో ఒకరైన నాథన్‌ను రెండు రోజుల పాటు సాగిన ఈ విచారణలో నిర్దోషి అని జ్యూరీ తేల్చింది. ఆందోళనల సమయంలో నాథన్ వ్యవహరించిన తీరు సరిగా లేకపోవడంతో స్కాట్లాండ్ పోలీసులకు గాయాలు అయ్యాయని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అయితే అక్కడ ప్రత్యక్ష సాక్షులుగా వున్న ఇద్దరు పోలీసులు ఇందుకు భిన్నమైన కథనాలను తెలియచేశారు. అంత ప్రమాదకరమైన సంఘటన జరుగుతున్న సమయంలో పోలీసులు హెన్నెబ్రేను అదుపులోకి తీసుకుని ఎందుకు ప్రశ్నించలేదని న్యాయస్థానం ప్రశ్నించింది. పైగా కొద్ది గంటల తేడాలో ఆయనను అరెస్టు చేశారని పేర్కొంది.

వాస్తవాలను అంగీకరించలేకే....!



ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్) డైరెక్టర్ కె.ఎస్.జేమ్స్‌ను సస్పెండ్ చేయడానికి తమ వద్ద ప్రాధమిక ఆధారాలు వున్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇది ప్రతీకారేచ్ఛతో తీసుకున్న చర్యేనన్నది స్పష్టం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) లను సిద్ధం చేసి, ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అందచేయడానికి ఐఐపిఎస్ యత్నించడమే నేరమైపోయింది. ఇటీవలి సంవత్సరాల్లో, ప్రభుత్వ విధానాలు, వాటి పర్యవసానాల గురించి ఇబ్బందికరమైన ఎటువంటి వాస్తవాలు బయటకు వచ్చినా సహించలేకపోతోంది. ఏ డేటానైనా, చివరికి తన సొంత సంస్థలే విడుదల చేసినా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ఆ డేటాను ఒక ఫీడ్‌బ్యాక్‌గా ఉపయోగించుకోవడానికి బదులు శత్రుపూరిత వైఖరితో చూస్తోంది. ఉదాహరణకు, దేశంలోని అన్ని గ్రామాలు బహిరంగ మల విసర్జన రహితం (ఒడిఎఫ్)గా మారాయని 2019లో ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. ఆ ప్రకటనలోని డొల్లతనం ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 (2019-21) సర్వేలో బయటపడింది. దేశంలో సర్వే చేసిన వాటిలో 19శాతం కుటుంబాలు ఎలాంటి టాయిలెట్ సౌకర్యాన్ని ఉపయోగించడం లేదని ఆ సర్వే నిగ్గుతేల్చింది. 2018 అక్టోబరులో జరిగిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ సర్వే, జాతీయ వార్షిక గ్రామీణ ప్రాంత పారిశుధ్య సర్వే 2019-20, ఈ ఏడాది ప్రారంభంలో విడుదలైన బహుళ సూచీల సర్వే ఇవన్నీ కూడా ఇప్పటికీ అనేక గ్రామాలు బహిరంగ మల విసర్జన రహితంగా లేవని పేర్కొన్నాయి. అలాగే ప్రజల్లో రక్తహీనత పెరిగిందని కూడా ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 సర్వే పేర్కొంది. ఉజ్వల యోజన ప్రభావాన్ని ప్రశ్నిస్తూ, సర్వే చేసిన గ్రామీణ కుటుంబాల్లో 57శాతం మందికి ఎల్‌పిజి కనెక్షన్ లేదని పేర్కొంది. ఇతర గణాంకాల ఫలితాలతో ఇటీవల కాలంలో ఏమి జరిగిందో కూడా తెలుస్తోంది. ద్రవ్యోల్బణం, దారిద్ర్యానికి సంబంధించిన కీలకమైన సూచీలు 2011-12 నాటి వినిమయ వ్యయ సర్వే (సిఇఎస్)లతో ముడిపడి వున్నప్పటికీ డేటా నాణ్యత పట్ల తలెత్తుతున్న ఆందోళనలను సాకుగా చూపి 2017-18 సంవత్సరానికి వినిమయ వ్యయ సర్వేలను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. 2018లో జాతీయ గణాంకాల కమిషన్, ఎన్‌ఎస్‌ఎస్‌ఓ చేపట్టిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేకు అనుమతించినప్పటికీ నిరుద్యోగం పెరిగిందని సర్వేలో వెల్లడైనందుకు ఆ సర్వే ఫలితాలను నిలిపేశారు. 2019లో ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆ సర్వే ఫలితాలను వెల్లడించారు. సర్వే ఫలితాల వెల్లడిలో జరిగిన ఈ జాప్యం పట్ల, ఆలాగే గణాంకాల అంశాల్లో నీతి అయోగ్ జోక్యం పట్ల ఎన్‌ఎస్‌సి మాజీ తాత్కాలిక చైర్మన్, మరో సభ్యుడు రాజీనామా చేశారు.



మీకోసం

కూరలు వండేటప్పుడు నూనె వేడెక్కగానే కాస్త పసుపు వేస్తే, వాటి సహజరంగు కోల్పోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

కాలాన్ని ఎలా గడపాలో కాదు.. ఎలా ఉపయోగించుకోవాలో తెలిసినవారు అన్ని పనుల్లో ప్రావీణ్యత సాధిస్తారు.

JEEVANA జీవన the family

తెలుగు జాతికి వారసులం..!



బాలలం మేం బాలలం
వడి వడిగా బడికి వెళతాం
బుద్ధిగా చదువుకుంటాం!

మా వూరి బడికే పోతాం !
ఆడుతూ పాడుతూ ....
చక్కగా చదువుకుంటాం!

అమ్మ భాషలోనే
అక్షరాలను దిద్దుకుంటాం!
నాన్న గారిలాగా
ఉన్నతంగా ఎదుగుతాం!

తరగతి పాఠాలను చదివి
సులువుగా అర్థం చేసుకుంటాం!

మా సంతకాలను మాత్రం
అచ్చ తెలుగులోనే చేస్తాం!


పెద్ద చదువులను దీక్షతో చదువుతాం
ఉన్నత ఉద్యోగాలను తప్పక సాధిస్తాం
మా వూరి అభివృద్ధికి సహకరిస్తాం!

బాలలం మేం బాలలం
భావి భారత నిర్మాతలం!
తెలుగు జాతికి వారసులం!

- జి.సూర్యనారాయణ
6281725659.

దేని నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ కొన్ని జీవుల బొమ్మలు ఉన్నాయి. ఎదురుగా వాటి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.



నేను గీచిన బొమ్మ





బి.వెంకట చైతన్య,
7వ తరగతి,
యల్లపాలెం, కోడవల్లూరు,
నెల్లూరు.

వివరణ
ఆగస్టు 3వ తారీఖున చిన్నారి పేజీలో ఇచ్చిన 'లెక్క చేద్దాం' శీర్షికలో జవాబును 109గా ఇలా చదువుకోగలరు.
ఎడిటర్

తల్లిపాలే అమృతం



ఆగస్టు 1 - 7 : తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రొటీన్లు, విటమిన్ల వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమతూకంలో ఉంటాయి. కాన్పు తర్వాత మొదటి రెండు, మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమైనవి. భావి ఆరోగ్యానికి తొలి బీజం వేసేవి ఇవే. ఇవి ఒక రకంగా తొలి టీకా లాంటివి. ఇందులో ఉండే ఇమ్యునోగ్లోబులిన్లు బిడ్డ రోగనిరోధక శక్తి పెంపొందటానికి తోడ్పడతాయి. ఇన్‌ఫెక్షన్ల భారిన పడకుండా కాపాడతాయి. ఐదారు రోజులకు పాలు కాస్త పలుచబడినప్పటికీ వాటిలో కొవ్వులు, లాక్టోజ్ బాగా ఉంటాయి. అవి బిడ్డకు మరింత శక్తినిస్తాయి. రెండు వారాల తర్వాత తల్లిపాలలో 90 శాతం నీరు., 8 శాతం పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రొటీన్లు.. 2శాతం ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. ఇలా బిడ్డ అవసరాలకు అనుగుణంగా మారిపోయే తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదు.

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది



తల్లి పాలు వల్ల ఇన్ఫెక్షన్లు, డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, వాంతులు, వంటి సమస్యలు రాకుండా కాపాడుతాయి. తల్లికి బ్రెస్ట్ కాన్సర్, అండాశయ క్యాన్సర్లు వంటివి రాకుండా ఉంటాయి. శిశువులకు 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. ఈ పాలలో ప్రోటీన్లు, విటమిన్లు, అధికంగా ఉండి, రోగ నిరోధక శక్తిని కల్గి ఉంటాయి. దీనితో బిడ్డ ఆరోగ్య కరమైన బరువుతో పెరటానికి తోడ్పడుతుంది. ఈ పాలు తేలికగా జీర్ణం అవుతాయి. తల్లి పాలు పెట్టడం వల్ల తల్లి మానసిక వత్తిడికి దూరం అవుతారు. తల్లిపాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. తమ బిడ్డలకు ఆరోగ్యకరమైన పాలు ఇవ్వాలి.

– శారమ్మ, పిల్లల వైద్య నిపుణురాలు, గన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అపోహలు వద్దు



బిడ్డ పుట్టిన తరువాత మొదటి ఆరు నెలలు కూడా బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదు. బిడ్డను తల్లిపాలకు దూరం చేయడం అర్థరహితం. తల్లి తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడో, పాలు పడనప్పుడో బిడ్డకు ఇతర ఆహారం ఇవ్వాలి. తల్లిపాల విశిష్టత గురించి ఎంతగా ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇప్పటికీ కొన్ని అపోహలు ఉన్నాయి. బిడ్డకు అవసరమైన పోషకాలన్నీ కూడా తల్లిపాలలోనే ఉంటాయి. పాలు పట్టేందుకు ముందుగా ప్రతిసారి రొమ్ము శుభ్రం చేసుకోవాలి. వైద్యుల సూచన మేరకే పాలు పట్టడం ఆపాలి తప్పితే సాధారణ పరిస్థితుల్లో, సాధారణ అనారోగ్యాలు ఉన్నప్పుడు పాలు పట్టొచ్చు. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి బిడ్డను కాపాడేది తల్లిపాలే. తల్లికి, పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ, తల్లి గర్భంతో ఉన్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వొచ్చు. తల్లి సరైన రీతిలో పోషకాహారం తీసుకుంటే చాలు. అతిగా ఆహారం తీసుకోవడం, మరీ ఎక్కువగా పాలు తాగడం చేయనవసరం లేదు.

– డాక్టర్ ఎస్.ఇందిరాదేవి
మెడికల్ సూపరింటెండెంట్
డిసిహెచ్‌ఎస్, గుడివాడ.

తల్లికీ బిడ్డకూ ఆరోగ్యమే



ప్రపంచ తల్లిపాల దినోత్సవ కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచి ఏడోతేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. తల్లి పాలు ఇవ్వటాన్ని ప్రోత్సహించండి. ఇది మనందరి బాధ్యత అనే నినాదంతో ప్రజల ముందుకు తీసుకెళ్తున్నాం. సాధారణ, సి సెక్షన్(సిజేరియన్) డెలివరీ రెండింటిలోనూ డెలివరీ అయిన ఒక గంటలోపు తల్లి తమ బిడ్డకు తప్పకుండా పాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది తల్లికి, బిడ్డకు ఆరోగ్యకరం. తల్లి పాల వారోత్సవాల్లో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి. కాల్షియం ఎక్కువగా ఉండే ఆకుకూరలు, బాదం, జీడిపప్పు వంటివి కూడా తింటుండాలి. తినే ఆహార పదార్థాల్లో వెల్లుల్లి ఉండేలా చూడాలి. నువ్వుల నూనెతో చేసిన వంటకాలు తినటం మంచిది. తల్లి ఆవుపాలు తాగితే మంచిది. తల్లిపాల ఉత్పత్తికి ప్రధానంగా చేయాల్సింది తల్లులు చిన్నా రులకు తరచుగా పాలు పట్టడం. పాల ఉత్పత్తి పాలు తాగడం మీద ఆధారపడి ఉంటుంది. అప్పుడే పుట్టిన శిశువుకు చాలామంది నీరుగానీ, గ్లూకోజు నీరుగానీ, చక్కెరగానీ, తేనెగానీ తాగిస్తుంటారు. వీటివల్ల కడుపు నిండి శిశువు పాలు తాగే ప్రయత్నం చేయదు. పాల ఉత్పత్తి ప్రక్రియ జరగదు. అంతేగాక వీటి ద్వారా చిన్నారులు సూక్ష్మజీవుల బారిన పడే ప్రమాదముంది.

– డాక్టర్ ఎస్.మల్లేశ్వరమ్మ
వైద్యాధికారి, కింతలి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్రీకాకుళం జిల్లా

ముర్రుపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠం



తల్లిపాల ఆవశ్యకతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్)లు ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టాలని సూచిస్తున్నాయి. శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని, కనీసం ఆరు నెలల పాటు కొనసాగించాలని సిఫార్సు చేశాయి. అయితే బిడ్డ పూర్తిగా అభివృద్ధి చెందాలంటే కనీసం రెండు సంవత్సరాలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని చెబుతున్నాయి. ప్రతి తల్లి తన బిడ్డకు సరిపోను పాలు ఇవ్వగలదని నిపుణులు చెబుతున్నారు. తల్లి పాలు పిల్లలకు మాత్రమే కాదు తల్లులకు కూడా ఆరోగ్యమే. తల్లి పాలు సమృద్ధి కరమైన, అనేక పోషక విలువలు కలిగిన ఒక దివ్యౌషధం వంటివి. బిడ్డ పుట్టిన మొదటి గంట లోపే ముర్రు పాలు పట్టించాలి.

– డాక్టర్ టి. సాయి ప్రసన్న
వైద్యాధికారి, తోట్ల వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

శిశువులు ఆరోగ్యంగా పెరుగుతారు



తల్లిపాలు ఉత్పత్తి సరఫరా ప్రక్రియను ఇంగ్లీషులో 'టైలర్ మేడ్' అంటారు. ప్రకృతి శిశువులకు ఎప్పుడు ఏది అవసరమో అది తల్లుల ద్వారా అందించింది. మరో ఆలోచన అనవసరం. తాగేటప్పుడు పిల్లలు పాలతో పాటు కొంతగాలి కూడా మింగుతుంటారు. కొందరు తల్లులు పిల్లల్ని ఎక్కువగా కదిలిస్తారు. అందువల్ల తాగినపాలు బయటకి వస్తాయి. దీనిని వైద్యపరిభాషలో 'పొసెట్టింగ్' అంటారు. ఇది వాంతి వ్యాధి కాదు. ఈ సహజ చర్యకు ఎలాంటి మందులు వాడకూడదు. తల్లిపాలు పట్టిన తర్వాత భుజంపై పడుకోబెట్టుకుని, శిశువు వీపుపై తరచుగా చేతితో తట్టాలి. ఇందువల్ల మింగిన గాలి బయటకు వస్తుంది. పాలుపట్టిన తర్వాత శిశువులను ఎక్కువగా కదిలించరాదు. చిన్నారుల్లో ఏడుపునకు అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో ఆకలి కూడా ఒకటి. తల్లిపాలు మాత్రమే తాగే పిల్లలు రోజుకు ఆరుసార్ల కన్నా ఎక్కువ సార్లు మూత్రవిసర్జన చేస్తుంటే, సంతృప్తికరమైన పెరుగుదల ఉంటే చిన్నారులకు తల్లిపాలు సరిపోయినట్లే.

– డాక్టర్ ఎస్.మాధవీలత
గైనకాలజిస్ట్, నందిగామ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

కష్టజీవుల గొంతుక షడ్రక్

- వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజల మనిషి , కష్టజీవుల గొంతుక టి.షడ్రక్ అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల అన్నారు. సిపిఎం కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్యభవన్‌లో సిపిఎం కర్నూలు జిల్లా సీనియర్ నాయకులు టి.షడ్రక్ మూడవ వర్ధంతి సభ నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన నిర్వహించారు. పి.నిర్మల, షడ్రక్ సతీమణి అన్నపూర్ణమ్మ, కుమారుడు డాక్టర్ వినోద్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయి బాబ, కె.సుధాకరప్ప పాల్గొన్నారు. ముందుగా టి.షడ్రక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పి.నిర్మల మాట్లాడుతూ.. షడ్రక్ మరణం సిపిఎంకు, కర్నూలు జిల్లా ప్రజలకు తీరని లోటు అని అన్నారు. పట్టుకున్న ఎర్రజెండాను తుది శ్వాస వరకు విడవకుండా కార్మిక, కర్షకుల, బహుజనుల హక్కుల కోసం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ టి.వినోద్ మాట్లాడుతూ.. నాన్నను స్ఫూర్తిగా తీసుకొని డాక్టర్‌గా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సిపిఎం నగర నాయకులు ఎస్ మహమ్మద్ రఫీ, కె ప్రభాకర్, వి శంకర్, ఉమాదేవి, కిరణ్మయి, శిరీష తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో షడ్రక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్మల, తదితరులు

20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు

- ఆర్డినెన్స్ తెచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం నుంచి అసైన్డ్ భూముల పట్టాలు పొంది 20 ఏళ్లు దాటిన వారికి భూ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఆర్డినెన్స్‌ను గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఇటీవల జరిగిన కేబినెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పిఒటి యాక్ట్-1977కు సవరణలు చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తెచ్చింది. ఇప్పటి వరకు అసైన్డ్ భూములు కేవలం అనుభవించేందుకు మాత్రమే హక్కులు కలిగి ఉండగా, ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ద్వారా ఆయా భూములను అమ్ముకునే హక్కు ఆయా భూ యజమానులకు కలుగుతుంది. ఒకవేళ అసైన్డ్ భూమి పక్కన వ్యవసాయేతర భూమి ఉండి, వాటి ధరలు ఎక్కువగా ఉంటే మార్కెట్ విలువకు అనుగుణంగా వ్యత్యాసాన్ని కొనుగోలుదారు చెల్లించాలని ఆర్డినెన్స్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇంటిస్థలాల పంపిణీ జరిగిన పదేళ్ల తర్వాత వాటిని అమ్ముకునేందుకు వీలు కల్పిస్తూ ఆర్డినెన్స్‌లో ఈ అంశాన్ని కూడా పొందుపరిచారు.

ముగిసిన డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల తొలిదశ కౌన్సెలింగ్ ముగిసింది. విద్యార్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్లను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేసింది. మొత్తం 1,045 కళాశాలల్లో 3,33,757 సీట్లు అందుబాటులో ఉండగా, 1,46,737 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,29,653 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,27,659 మందికి ఉన్నత విద్యామండలి సీట్లను కేటాయించింది. 16 కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు.

ఎన్‌హెచ్‌ఎంలకు హెచ్‌ఆర్ ఏర్పాటు చేయాలి : జెఎసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం కమిషనరుకు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కోశాధికారి జె సింహాచలం, కన్వీనరు సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎపి ఎస్‌జిసిఒఇఎఫ్ ఛైర్మన్ డి దయామణి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22,000 మంది ఎన్‌హెచ్‌ఎంలు 200 విభాగాల్లో అనేక ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని, కానీ వారికి వర్తించే వేతనాలు, ఇతర సౌకర్యాలు కాంట్రాక్టు, ఆప్కాస్‌లో చేస్తున్న తమకు అమలు కావడం లేదని అన్నారు. 'సెంట్రల్ గైడ్‌లైన్స్ ఆన్ హ్యూమన్ రిసోర్సెస్ ఫర్ ఎన్‌హెచ్‌ఎమ్ 2022' ప్రకారం ఉద్యోగులకు వేతనాలు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, ప్రమాద బీమా, జీవిత బీమా, కార్మిక చట్టాలు, అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి అన్ని స్థాయిల్లో ఇంటర్నల్ కంప్లైంటు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

ప్రొఫెసర్ల నియామకాల రద్దు చెల్లదు

సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 2017, 2018లో చేపట్టిన ప్రొఫెసర్ల నియామకాలు సక్రమమేనని, వారి నియామకాల రద్దు చెల్లదని, వారిని కొనసాగించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2017, 2018లో చేపట్టిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రొఫెసర్ ఎం వెంకటేశ్వరరావు తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ప్రొఫెసర్ల తరపున న్యాయవాది వై రాజగోపాలరావు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత, ఈ అంశంపై విశ్వ విద్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. అన్ని రిజర్వేషన్లు పాటించిన తరువాత కూడా 21 మంది ప్రొఫెసర్లను ఎలా తొలగిస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపు న్యాయవాదిని జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశ్నించారు. ప్రొఫెసర్లను కొనసాగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది బదులిచ్చారు. దాంతో ప్రొఫెసర్లను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది.

డిజిటల్ హెల్త్ రికార్డులపై ఎన్‌హెచ్‌ఎ ప్రశంసలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన వినూత్నమైన, అత్యుత్తమైన విధానాల్ని నేషనల్ హెల్త్ అథారిటీ ప్రశంసించిందని వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మహిళా ఆర్చర్ల జట్టుకు స్వర్ణం

ఆర్చరీ ప్రపంచకప్‌లో రికార్డు పతకం



బెర్లిన్: ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు రికార్డు నెలకొల్పింది. బెర్లిన్‌లో జరుగుతున్న ఆర్చరీ పోటీల్లో మహిళల కాంపౌండ్ విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకొని ఈ రికార్డును సాధించింది. జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, అదితీ గోపించంద్ స్వామితో కూడిన మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు శుక్రవారం జరిగిన ఫైనల్లో మెక్సికోపై 235-229 పాయింట్లతో విజయం సాధించింది. ఫైనల్ రౌండ్‌లో గురి తప్పకుండా బాణం విసిరి ఈ పోడియంపై భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. స్వర్ణ పతకం నెగ్గిన అనంతరం వీరు మాట్లాడుతూ.. 'మాకు చాలా సంతోషంగా ఉంది. మేము ఈ పోటీల్లో దేశానికి తొలి స్వర్ణ పతకాన్ని అందించాం. టోర్నీ ఆరంభం నుంచి ఫైనల్ వరకు ఆటపైనే దృష్టి పెట్టాం. కచ్చితంగా బంగారు పతకం గెలుస్తామనే నమ్మకంతో బరిలోకి దిగాం' అని తెలిపారు. స్వర్ణ పతకం గెలిచే క్రమంలో భారత మహిళా ఆర్చర్లకు తొలి రౌండ్‌లోనే బై లభించింది. ఆ తర్వాతి రౌండ్‌లో చైనీస్ తైపీనిక్వార్టర్స్‌లో టర్కీని ఓడించి సెమీస్‌కు చేరారు. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ కొలంబియాను 220-216తో ఓడించి ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే.

సెమీస్‌కు ప్రణయ్, ప్రియాన్షు

ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు ప్రవేశించారు. ప్రపంచ 9వ ర్యాంకర్ ప్రణయ్ 16-21, 21-17, 21-14తో ఆంథోనీ గిన్‌టింగ్(ఇండోనేషియా)పై చెమటోడ్చి నెగ్గాడు. దీంతో ప్రణయ్ ఈ ఏడాది మూడో బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ టూర్ ఈవెంట్‌లో సెమీస్‌లోకి దూసుకెళ్లాడు. ఇక మరో క్వార్టర్‌ఫైనల్లో ప్రియాన్షు 21-13, 21-8తో సహచర ఆటగాడు కిదాంబి శ్రీకాంత్‌పై వరుససెట్ల లో గెలిచాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రియాన్షు 31ర్యాంక్ ప్లేయర్. ఈ ఏడాది వరల్డ్ టూర్ సూపర్-500 ఈవెంట్‌లో తొలిసారి ప్రియాన్షు సెమీస్‌కు చేరాడు. శనివారం జరిగే సెమీస్‌లో ప్రియాన్షు రాజ్‌వత్.. హెచ్‌ఎస్ ప్రణయ్‌తో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు 12-21, 17-21తో 4వ సీడ్ బివెన్ జంగ్ చేతిలో ఓటమిపాలైంది.

భారత్-జపాన్ హాకీ మ్యాచ్ డ్రా

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ



చెన్నై: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో పసికూన జపాన్‌తో మ్యాచ్‌ను పటిష్ట భారతజట్టు డ్రా చేసుకుంది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో చైనాపై 7-2గోల్స్ తేడాతో ఘన విజయం సాధించాయిన భారతజట్టు శుక్రవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో జపాన్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకొని సంతృప్తి పడింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమైనా.. రెండో క్వార్టర్ 28వ నిమిషంలో జపాన్ తరపున కెన్ నాగయోషి గోల్ చేయడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత మూడో క్వార్టర్ 43వ నిమిషంలో భారత్ తరపున ఏకైక గోల్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ చేశాడు. చివరి క్వార్టర్‌లో భారత్‌కు గోల్‌చేసే అవకాశాలు లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇతర పోటీల్లో మలేషియా జట్టు 5-1గోల్స్ తేడాతో చైనాను చిత్తుచేయగా.. దక్షిణకొరియా-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది. ఆదివారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు మలేషియాతో, చైనా జట్టు కొరియాతో, పాకిస్తాన్ జట్టు జపాన్‌తో తలపడనున్నాయి. రెండు లీగ్ పోటీలు ముగిసిన అనంతరం మలేషియా జట్టు 6పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. భారత్(4పాయింట్లు), కొరియా(4పాయింట్లు) 2, 3 స్థానాల్లో ఉన్నాయి.

ఇంగ్లండ్ విధ్వంస బ్యాటర్ హేల్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ అలెక్స్ హేల్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. టీ20 స్పెషలిస్ట్‌గా పేరొందిన హేల్స్.. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లకు గుడ్‌బై చెబుతున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఇంగ్లండ్స్-వేల్స్ క్రికెట్ బోర్డులకు పంపాడు. 2011లో భారత్‌పై టీ20ల్లో అరంగేట్రం చేసిన హేల్స్.. ఈ ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగాడు. 2022లో ఇంగ్లండ్ జట్టు టి20 ప్రపంచకప్‌లో నెగ్గడంలో కీలకపాత్ర పోషించాడు. 12ఏళ్ల కెరీర్‌లో 75 టీ20లు, 70 వన్డేలు, 11టెస్టు మ్యాచ్‌లు ఆడాడు.

డెలానీ, హ్యాండ్‌లకు చోటు

జట్టును ప్రకటించిన ఐర్లాండ్ బోర్డు

డబ్లిన్: భారత్‌తో జరిగే మూడు టి20ల సిరీస్‌కు ఐర్లాండ్‌ను ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. 15మందితో కూడిన జట్టులో లెగ్ స్పిన్నర్ గరెత్ డెలాని, ఆల్‌రౌండర్ ఫియోన్ హ్యాండ్‌లను సెలెక్టర్లు చోటు కల్పించాడు. ఆగస్టు 18న భారత్, ఐర్లాండ్ మధ్య మూడు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా పునరాగమనం చేస్తున్నాడు.

జట్టు: స్టిర్లింగ్(కెప్టెన్), బల్‌బిర్నీ, అడెయిర్, రాస్ అడెర్, చాంఫర్, డెలాని, డాక్రెల్, హ్యాండ్, లిటిల్, మెక్‌కార్తీ, టెక్టర్, లొర్కాన్ టక్కర్, వాన్ వొర్కమ్, బెన్ వైట్, క్రేగ్ యంగ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68